ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

గుంటూరు

జిల్లా వార్తలు

5

మంగళవారం 17 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

17-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	37	28
తెనాలి	36	28
నరసరావుపేట	36	27
బాపట్ల	36	28
రెంటచింతల	36	27
చీరాల	36	28

కౌలు రైతు సుఖీభవ అనండి

సొంత పొలం ఉన్న వారి వివరాలు మాత్రమే

అన్నదాత సుఖీభవ పథకానికి ప్రస్తుతం సొంత పొలం యజమానుల వివరాలనే నమోదు చేయాలనే ఆదేశాలు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కౌలు రైతులకు పథకం వర్తింప చేయడంపై తమకు ఎలాంటి మార్గ దర్శకాలు రాలేదనేది యంత్రాంగం మాటగా ఉంది. పెట్టుబడి సాయంలో చేదోడువాదోడుగా ఉండే అన్నదాత సుఖీభవ పథకం తమకు అందించే విషయంలో ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయానికి రాకపోవడం పట్ల కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిలో అయోమయం

- అర్హులుగా సొంత పొలం యజమానులు
- కౌలు దారుల సంగతి ఎటూ తేల్చని ప్రభుత్వం
- సీసీఆర్ కార్డుల జారీ ఇంకా ప్రారంభ దశలోనే
- మనుగడలో ఉన్న కార్డులు నిరుపయోగంగానే..
- పెట్టుబడి ఖర్చులకు ఏం చేయాలో పాలుపోని కౌలు రైతులు


అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రైతులకు అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితా విషయంలో వ్యవసాయ శాఖ తుది నిర్ణయానికి వచ్చింది. మరో మూ డు నాలుగు రోజుల్లో అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసేలా వడివడిగా ప్రభుత్వం అడుగు లేస్తోంది. కానీ, కౌలు రైతులకు ఈ సాయం అందడంపై నీలి మేఘాలు కమ్ము కున్నాయి. ఇప్పటి వరకు వారికి పెట్టుబడి సాయం అందిం చడంపై ఎలాంటి మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయ లేదు. దీంతో అన్నదాత సుఖీభవ పథకం తమకు ఎండమావిగానే మిగలనుందా అనే ఆందోళనను కౌలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

(తెనాలి, ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల (పంట సాగు హక్కు పత్రాలు) జారీ ప్రక్రియ ఈ పాటికే ఓ కొలిక్కి రావాల్సి ఉండగా.. ఇంకా ప్రారంభ దశలోనే ఉండడం వారిని మరింత కలవరపరుస్తోంది. కౌలు రైతుకు ఏ ప్రయోజనం దక్కాలన్నా సీసీఆర్ కార్డే ప్రామాణికం చేయడంతో పాటు.. ఓ ప్రణాళిక లేని నిర్ణయాలతో గత ప్రభుత్వం వారి ప్రయోజనాలకు పెద్ద ఎత్తున గండి కొట్టిన సంగతి తెలిసిందే. సీసీఆర్‌సీ స్థానంలో కొత్త కౌలు చట్టం తెస్తామని ప్రస్తుత ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ, ఇంతవరకు అది కార్యరూపం దాల్చకపోగా ఖరీఫ్ పనులు మొదలైనా సీసీఆర్ కార్డుల జారీ కనీసం 20 శాతం కూడా పూర్తి కాకపోవడం వ్యవసాయశాఖ వైఫల్యంగా కనబడుతోంది. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం తమ గోడు కూడా ఆలకించాలని, ఇప్పటికే వ్యాలిడిటీ ఉన్న కార్డుల విషయంలో పథకం అమలుపై ఆలోచించాలని కౌలు రైతులు ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు.

◆ కౌలు రైతులే అధికం

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 4.50 లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటారనేది ఓ అంచనా. వీరిలో సొంత పొలం కనీసం అరెకరం

(మిగతా 8వ పేజీలో)



● సెయింట్ జోసఫ్స్ ఆస్పత్రి వైపు ప్రారంభమైన కరెంట్ స్తంభాల షిఫ్టింగ్

పెమ్మసాని సమీక్ష..

పోల్స్‌షిఫ్టింగ్‌లో కదలిక

- నేడు విద్యుత్, నగరపాలక, ఆర్‌అండ్‌బీ జాయింట్ ఇన్‌స్పెక్షన్
- అంచనా విలువని సాధ్యమైనంత తగ్గించేందుకు కసరత్తు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ సన్నాహక పనుల్లో కొంత కదలిక వచ్చింది. నిన్న, మొన్నటి వరకు అలివికాని అంచనా విలువలు రూపొందించి విద్యుత్ స్తంభాలను రోడ్డు మార్జిన్‌కు మార్చకుండా జాప్యం చేసిన ఏపీ సీపీడీసీఎల్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్షతో దిగి వచ్చింది. సోమవారం ఉదయమే పాత పోల్స్, విద్యుత్ లేన్ల తొలగింపు పనులను సెయింట్ జోసఫ్స్ ఆస్పత్రి వైపు నుంచి మొదలు పెట్టింది. అలానే పోల్స్ షిఫ్టింగ్, కొత్త స్తంభాల ఏర్పాటుకు సాధ్యమైనంత మేరకు అంచనా విలువని తగ్గించేందుకు మంగళవారం ఆ సంస్థతో పాటు నగరపాలక సంస్థ, ఆర్ అండ్‌బీ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి ఒక అంగీకారానికి రానున్నారు. దాంతో పోల్స్ షిఫ్టింగ్, కొత్త టవర్ల ఏర్పాటు పనులు జోరందుకొంటాయని అధికార వర్గాలు తెలిపాయి.

కేంద్ర సహాయ మంత్రి దృష్టికి..

ఇంచుమించు నెల రోజుల నుంచి శంకర్ విలాస్ ఆర్‌వోబీ పనుల్లో స్తబ్ధత నెలకొంది. బ్రిడ్జి నిర్మాణం కోసం ఇచ్చిన మార్కింగ్ లోపల ఉన్న కట్టడాల తొలగింపు పూర్తి కాలేదు. మరోవైపు విద్యుత్ స్తంభాల తొలగింపులో తీవ్ర జాప్యం జరుగుతూ వస్తోంది. ఈ కారణంగా మే 20వ తేదీ లోపే కాంట్రాక్టర్ ఇరువైపులా పిల్లర్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చేసుకొన్న ఏర్పాట్లన్ని నిలిపేయాల్సి వచ్చింది. దీని వల్ల బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమయ్యే పరిస్థితి తలెత్తింది. ఈ విషయం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని దృష్టికి వెళ్లడంతో ఆయన సంబంధిత శాఖలన్నింటిని గత వారం సమావేశపరిచి జాప్యం ఎక్కడ జరుగుతుందనే దానిపై ఆరా తీశారు.

మాట ఇచ్చి.. కార్పొరేషన్ తటపటాయింపు

ఈ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నగరపాలక సంస్థ తన పాత్ర ఎంత వరకు అనే దానికి లోబడి ఉంటే సరిపోయేది. మున్ముందు కరెంటు స్తంభాలు షిఫ్టింగ్ తదితర పనులన్నీ తానే చూసుకొంటానని మాట ఇచ్చింది. అసలు నిబంధనల ప్రకారం అయితే వీటన్నింటిని ఆర్ అండ్ బీ అధికారులు ఎస్టిమేషన్స్‌లో చేర్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించి ఆమోదం తీసుకోవాలి. అయితే నగరపాలక సంస్థ తానే భరిస్తానని చెప్పడంతో ఆర్ అండ్ బీ ఈ విషయంలో పక్కకు తప్పుకుంది. ఇప్పుడు అదే విషయాన్ని ఆ శాఖ కార్పొరేషన్‌కు అప్పజెబుతోంది.

రూ.2 కోట్లని.. రూ.4 కోట్ల అంచనా

కరెంటు పోల్స్ షిఫ్టింగ్, కొత్తవి ఏర్పాటు కోసం తొలుత రూ.2 కోట్లు చాలని అంచనా వేశారు. ఆ తర్వాత బ్రిడ్జి ఎత్తు పెరిగిందని పేర్కొంటూ విద్యుత్ శాఖ టవర్లు నిర్మించాలని చెప్పి రూ.4 కోట్లకు అంచనాలు పెంచారు. అంత పెద్ద మొత్తంలో నగరపాలక సంస్థ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు విడుదల చేయడానికి పరిపాలన శాఖ అనుమతించడం లేదు. దీంతో నగరపాలక సంస్థ తాను రూ.కోటికి మించి ఇవ్వలేనని తేల్చేసింది. దీనిపై అందరూ ఆక్షేపించారు. కనీసం రూ.2.70 కోట్లు అయినా ఇవ్వాలని పెమ్మసాని ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి టవర్లు ఎక్కడెక్కడ అవసరమో నిర్ధారించి, మిగతా చోట్ల సాధారణ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



టమాట ధర పైపైకి!

- వారంలోనే కేజీకి రూ.10 పెరుగుదల
- రైతు బజార్లలో రూ.16 నుంచి రూ.26
- రిటైల్‌గా రూ. 20 నుంచి రూ.30

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ నెల క్రితం హెచ్చరించిన విధంగానే టమాటల ధర పెరగడం ప్రారంభించింది. వారం క్రితం ఉన్న ధరతో పోలిస్తే కేజీకి రూ.10 వ్యత్యాసం కనిపిస్తోంది. ఇక రాబోయే రోజుల్లో ఇంకెంత పెరుగుతుందోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఒక దశలో కేజీ టమాట ధర రూ.100కి పైగా చేరింది. మళ్లీ పరిస్థితి ఉత్పన్నమవుతుందన్న చర్చ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ జిల్లా అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే టమాటల ధర అందుబాటులో లేకుండా పోయే పరిస్థితి ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. మార్కెటింగ్ ఉన్నతాధికారులు కూడా ఈ విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న పంట విస్తీర్ణం, దిగుబడులు, ఎగుమతు లు వంటి వాటన్నింటిని బేరీజు వేసి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే గతేడాది వలే రైతుబజార్లలో క్యూ లైన్లు దృశ్యాలు తప్పేలా లేవు.

మదనపల్లె మార్కెట్ నుంచి..

ఉమ్మడి గుంటూరు జిల్లాకు టమాటాలు మదనపల్లె మార్కెట్ నుంచే వస్తుంటాయి. గుంటూరు నగరానికే రోజుకు 8 లారీల టమాటాలు వస్తాయి. ఒక్కో లారీలో 10 నుంచి 12 టన్నుల టమాటాలు ఉంటాయి. మదనపల్లెలో పంట పుష్క లంగా ఉన్నా.. ఇతర రాష్ట్రాల నుంచి ఎగుమతుల ఆర్డర్లు పెరగడంతో ధర పెరగడం ప్రారంభించింది. గత వారం కేజీ టమాటాలు రూ. 16 మాత్రమే ఉంది. ఇప్పుడు రిటైల్ మార్కెట్లలో రూ.20కి విక్రయిస్తున్నారు. మూడు కేజీలు అయితే రూ.50కి ఇస్తున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైతు బజార్‌లోనే కేజీ రూ.26కి విక్రయిస్తున్నారు. అక్కడ క్వాలిటీ కొంచెం తక్కువగా ఉంటోందని వినియోగదారులు చెబుతున్నారు. ఇదే అదనుగా రిటైల్ మార్కెట్లలో కేజీ రూ. 30కు విక్రయిస్తున్నారు.

కేజీ టమాటాలు రూ.50 దాటితే వినియోగదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. మార్కెటింగ్ అధికారులు ఈ విషయంపై తక్షణమే దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. మార్కెటింగ్ డీడీ దివాకర్, ఏడీ సత్యన్నారాయణ చౌదరీ గత వారమే బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో టమాటాల ధర మరింత పెరగకుండా తగిన చర్యలు చేపట్టాలి.

సచివాలయ ఉద్యోగుల..

బదిలీలకు శ్రీకారం!



- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ ఉంటే.. బదిలీ తప్పనిసరి
- స్వగ్రామం, సొంత మండలాల్లో నియామకానికి చెక్
- ఈ నెల 30 నాటికి ప్రక్రియ పూర్తి

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా.. ఇప్పుడు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పోయిన అయిదేళ్లలో బదిలీలు లేకపోవ డంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బదిలీలకు అవకాశం కల్పించింది. గతేడాది నవంబరులో పరిమిత స్థాయిలో బదిలీలు జరగ్గా.. ఇప్పుడు జీవో నంబరు 5 ప్రకారం మొత్తం ఉద్యోగుల బదిలీకి అవకాశం కల్పించింది.

● ఐదేళ్లు దాటితే స్థాన చలనం తప్పదు

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కిందటేడాది ప్రభుత్వం అవకాశం కల్పించినా మెజారిటీ ఉద్యోగులు బదిలీలకు సిద్ధపడ లేదు. దీంతో నామమాత్రంగానే బదిలీలు జరిగాయి. దీంతో ఇప్పుడు ప్రభుత్వం సచివాలయాల్లో పాతుకుపోయిన వారిని బదిలీ చేసేందుకు పూనుకుంది. ఒకే సచివాలయంలో ఐదేళ్లపాటు విధుల్లో ఉన్న ఉద్యోగులను వేరే సచివాలయానికి బదిలీ చేస్తూ జీవో జారీ చేసింది. ఐదేళ్లు పూర్తికాని ఉద్యోగుల వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీ అయ్యేందుకు అవకాశం కల్పించింది. అయితే ఉద్యోగులు ఎవరూ వారి సొంత గ్రామాలు, మండలాలకు బదిలీ అయ్యే వీలు లేదు. దీని పైనే.. ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. తక్కువ జీతాలతో పనిచేసే వారికి సొంత ప్రాంతంలో పనిచేసుకునే అవకాశం కల్పిస్తే ఆర్థిక భారం తప్పు తుందని చెబుతున్నారు. బదిలీల జీవో వచ్చిన వెంటనే వారు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,322 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 562, పల్నాడు జిల్లాలో 532, బాపట్ల జిల్లాలోని ఉమ్మడి గుంటూరు జిల్లా వరకూ 228 సచివాలయాలు ఉన్నాయి మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 824 గ్రామ సచివాలయాలు ఉండగా వాటిలో 7,069 మంది ఉద్యోగులు పనిచేస్తు న్నారు. వీరి కోసం ఒక మాడ్యూల్ రూపొందించారు. వీరి బదిలీలకు సంబంధించిన ఖాళీల ఎంపిక ఎంపీడీవోలకు అప్పగిం చారు. కాగా ఉమ్మడి జిల్లాలో 439 వార్డు సచివాలయాల్లో 3,912 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి కోసం వేరొక మాడ్యూల్ రూ పొందించారు. వీరి బదిలీలకు సం బంధించిన ప్రక్రియని మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. వారే తమ పరిధిలో ఉన్న ఖాళీల వివరాలను నమోదు చేసి, కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు.

● ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీలు

ఉద్యోగుల ఎంపిక సమయంలో జరిగిన విధంగానే ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీల ప్రక్రియ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లే అప్పాయింటింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. బదిలీ ఆదేశాలు వారే ఇస్తారు. హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్లో రెండు మాడ్యూళ్లలో అభ్యర్థులు తమ బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

● ప్రత్యేక కేటగిరీలకు ప్రాధాన్యం

కంటి చూపులేని, బుద్ధి మాంద్యం పిల్లలు న్న ఉద్యో గులకు వైద్య సదుపాయాలు అందు బాటులో ఉన్న చోటే పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకోను న్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి సర్వీసు ఉన్నవారికి, వైకల్యం 40 శాతానికి మించి ఉన్నవారికి, ఆరోగ్య కారణాల రీత్యా (మిగతా 8వ పేజీలో)



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ భార్గవ తేజ

యోగాంధ్రలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లాలో నిర్దేశించిన ప్రాంతాల్లో యోగాసనాల కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలను భాగాస్వాములను చేస్తూ నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున భారీ స్థాయిలో యోగాసనాలు నిర్వహించడానికి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన 4,879 ప్రాంతాలను ముందస్తుగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించాలని ఆదేశించారు. అక్కడ యోగాసనాల నిర్వాహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరిని మెగా యోగాసనాల కార్యక్రమంలో పాల్గొనేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. యోగాసనాలు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల జనరేషన్ రెండు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

సీటీ శాఖలో బదిలీలు షురూ!

● 20 లోపు పూర్తి చేసేందుకు కసరత్తు

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగుల బదిలీలకు కసరత్తు జరుగుతోంది. బదిలీలపై ఇప్పటికే ప్రత్యేక మార్గదర్శకాలు విడుదలైన నేపథ్యంలో 20వ తేదీ లోపు బదిలీలు పూర్తి చేసేందుకు అధికారులు జాబితాను సిద్ధం చేస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు జోన్ పరిధిలోని గుంటూరు-1, 2, నెల్లూరు డివిజన్‌లలో బదిలీలకు గుంటూరు-1 జేసీ శ్రీలక్ష్మీ నోడల్ జాయింట్ కమిషనర్‌గా వ్యవహరించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సంస్కరణల పేరుతో అడ్డగోలుగా రీజినల్ కార్యాలయాల పేరుతో ఏర్పాటైన విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ కేంద్రాలకు ఉద్యోగులను బలవంతంగా సాగనంపినట్లు అప్పట్లోనే ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నూతన మార్గదర్శకాలతో వారంతా సొంత డివిజన్‌లకు వచ్చే అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓడీ పేరుతో సొంత డివిజన్‌లకు వెళ్లే సౌలభ్యం కల్పించడం, పరిపాలన సౌలభ్యం పేరుతో ఎక్కడికైనా బదిలీ చేసుకునే వెసులుబాటు ఇచ్చింది. గుంటూరు జోన్‌లో 12 ఏసీటీవో పోస్టులు ఖాళీ ఉండటంతో ఇతర జోన్‌ల నుంచి ఐదుగురు ఏసీటీవోలను బదిలీపై తీసుకురాగా, ఇక్కడున్న ఏడుగురు సీనియర్ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉందని చెబుతున్నారు.

లోపలి పేజీలో



● మంత్రి మనోహర్‌కు ఎకరం భూమిని విరాళంగా అందిస్తున్న దాత సువర్చల శశి కిరణ్

పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ భూ విరాళం

- మంత్రి మనోహర్ సమక్షంలో రూ.కోటి విలువైన భూమి పత్రాలు అందజేత
- కొలకలూరులో 'సెర్ప్' పరిశ్రమకు సహకారం
- స్ఫూర్తితో అభివృద్ధికి రూ.10 లక్షలు ప్రకటించిన మంత్రి

సమగ్ర విచారణ జరపండి

● చిలకలూరిపేట మున్సిపాలిటీలో రూ. 34 లక్షల కుంభకోణంపై ఎంపీ లావు లేఖ

మందకొడిగా... మిర్చి ఎగుమతులు

● మార్కెట్‌లో తగ్గిన జోష్ ● రోజుకు సగటును 35 వేల టిక్కీల విక్రయం

చదువులకు.. శ్రీనిధి బాసట

● డ్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం

వేట..మొదలు

చేపల వేటకు పయనమైన గంగపుత్రులు

8

సాగర్ సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటి మట్టం సోమవారం నాటికి 513.60 అడుగులు ఉంది. ఎస్ఎల్బీసీ 450 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

పెట్రోల్ పోసుకుని కుటుంబం ఆత్మహత్యాయత్నం

❖ జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట కలకలం



జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కొపనాతి శ్రీనివాసరావు, ఝాన్సీ దంపతులు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అవసరానికి అప్పు ఇచ్చిన వ్యక్తి సాక్షి సంతకం పేరుతో తమ ఎకరం రొయ్యల చెరువు రాయించుకున్నాడని, ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నాడని.. తమకు న్యాయం చేయాలంటూ భార్యభర్తలు ఇద్దరు పిల్లలతో సహా పెట్రోల్ పోసుకుని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకుని, వివరాలు సేకరించారు. బాధితుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం హారీస్‌పేటకు చెందిన కొపనాతి శ్రీనివాసరావుకు రెండెకరాల రొయ్యల చెరువు ఉంది. సమీప గ్రామం పాత హారీస్ పేటకు చెందిన మోపిదేవి పోతురాజు దగ్గర రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. పోతురాజు వడ్డీ వసూలు చేసింది చాలక.. పొలం కొన్నానని రిజిస్ట్రేషన్ కోసం సాక్షి సంతకం కావాలని చెప్పి శ్రీనివాసరావును తీసుకెళ్లి అతని.. ఎకరం రొయ్యల చెరువును రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులు తర్వాత మరొకరికి విక్రయించాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. అప్పు ఇచ్చిన నగదుకు చెరువు తీసుకున్నానని, గొడవపడి చంపుతానని బెదిరించినట్లు శ్రీనివాసరావు భార్య ఝాన్సీ వివరించింది. మిగిలిన ఎకరం చెరువు దగ్గరకు కూడా వెళ్లకుండా దుర్భాషలాడుతూ దాడికి యత్నిస్తున్నాడని వాపోయింది. పోతురాజుకు కన్నా శ్రీనివాసరావు అనే వ్యక్తి మద్దతుగా తమను బెదిరిస్తున్నాడని ఆమె వివరించింది. అడవుల దీవి పోలీసుస్టేషన్‌లో తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడని ఇక చేసేది లేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆత్మహత్యయత్నం చేసిన కుటుంబాన్ని పోలీసులు అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఎస్పీ తుషార్ డూడీ తీవ్రంగా స్పందించారు. వారికి ఎస్కార్ట్ ఇచ్చి రేపల్లె రూరల్ సీఐ పి.సురేష్ దగ్గరకు పంపించారు. నిజాంపట్నం తహసీల్దార్‌తో కలిసి వెళ్లి గ్రామంలో క్షేత్ర స్థాయి విచారణ చేపట్టి వెంటనే రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు.

మాజీ ఎంపీ నందిగం అనుచరులు బెదిరిస్తున్నారు

❖ ఎస్పీని ఆశ్రయించిన కారు డ్రైవర్లు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ దగ్గర 40 ఏళ్లుగా తాము కారు స్టాండ్ పెట్టుకొని జీవన సాగిస్తుంటే మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు తమను బెదిరిస్తున్నారని కారు స్టాండ్ డ్రైవర్లు వాపోయారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. డ్రైవర్ షేక్ బాజీ మాట్లాడుతూ.. తాము కొత్తపేటలోని ఆసుపత్రి నుంచి వచ్చే రోగులు, సహాయకులకు కార్లు పంపిస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడకు చెందిన మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు కొంతమంది తమ స్టాండ్ సమీపంలో ఎటువంటి అనుమతి లేకుండా కార్లు పెట్టుకొని తమను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇదేమిటని అడిగితే బెదిరిస్తున్నారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా గుంటూరు-విజయవాడ మధ్య సర్వీస్ కూడా తిప్పుతున్నారని పేర్కొన్నారు. అక్కడ ఓ వ్యక్తి కారు పెట్టుకోవాలంటే రూ.5వేలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో రూ.కోట్ల స్థలం రిజిస్ట్రేషన్

❖ పోలీసులకు సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఓ స్థలానికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ముఠాపై కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు.. అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 60 సెంట్ల స్థలానికి హైదరాబాద్‌కు చెందిన ఎల్లాప్రగడ చంద్రమౌళి, విశాఖకు చెందిన కలపాల రామకోటేశ్వరరావు, మాదాల శ్రీవల్లి, మహమ్మద్ అనే వారు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. చంద్రమౌళి స్థలం విక్రయించగా రామ కోటేశ్వరరావు, శ్రీవల్లి, మహమ్మద్ తదితరులు కొనుగోలు చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అసలు యజమానులు విషయం తెలుసుకొని సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. సబ్ రిజిస్ట్రార్ దీనిపై లోతుగా విచారించి, తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హామీ మేరకు తల్లికి వందనం అమలు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీ మేరకు తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉన్నా అంతమందికీ అమలు చేసిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. మొన్నటిదాక ప్రతిపక్షం సూపర్ సిక్స్ ఏమైందని క్యాంపెయిన్ చేసిందని, ఇప్పుడు తల్లికి వందనం నగదు జమచేయడం ప్రారంభం కాగానే ఇందులో రూ.2 వేలు ఏమైంది, మంత్రి లోకేశ్ ఖాతాలోకి వెళ్లాయి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో కూడా రూ.2 వేలు తీసుకున్నారని, ఇప్పుడు కూడా ఆ నగదు పాఠశాల నిర్వహణకు ఖర్చుపెట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. మంత్రి లోకేశ్ ముందుకు వచ్చి తనపై వచ్చిన ఆరోపణలు నిరూపించాలని చాలెంజ్ విసిరినా.. కనీసం దాని గురించి మాట్లాడింది లేదన్నారు. ఒక మంచి పని చేస్తుంటే దానుంచి దృష్టి మరల్చ డానికి ఇలాంటి అబాండాలు వేయడాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తుంచు కోవాలన్నారు. 15 రోజుల్లో అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కూడా రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును చిత్తశుద్ధితో కొంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, నిన్న వచ్చిన కేంద్ర మంత్రి కూడా దీనిపై సమీక్ష చేశారని చెప్పారు. పొగాకు కొనుగోలుపై ఆలోచిస్తున్నారని చెప్పారు. ప్రతి పక్షం దృష్టి మరల్చే రాజకీయం మానుకోవాలని, అదే పంథాలో పోతామంటే అధికార పక్షంలోని వారు చేతులు కట్టుకొని ఉండరని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, టీడీపీ, కూటమి నాయకులు ఉన్నారు.

సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా శ్రీనివాసమూర్తి



గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా ఎల్.శ్రీనివాసమూర్తి నియమితుల య్యారు. ఈ మేరకు సంఘ్ 113వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎన్ఎఫ్ ఐఆర్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసమూర్తి గుంటూరు డివిజన్‌లో సీటీఐ స్క్వాడ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన నియామకానికి సహకరించిన సంఘ్ డివిజనల్ సెక్రటరీ వీవీ రమ ణయ్య, అధ్యక్షుడు వై.సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైద్యుడు వెంకటేష్

తెనాలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదరంలో వైద్యుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని వీఎస్సార్ కళాశాల వద్ద మంగళగిరి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తెనాలి పట్టణానికి చెందిన బి.వెంకటేష్ (35), స్నేహితురాలు యామినితో కలిసి సోమవారం సాయంత్రం విజయవాడకు బయలు దేరారు. మార్గ మధ్యలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను వైద్యశాలకు తరలించగా వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యామిని చికిత్స పొందుతోంది. మృతుడు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల డయాలసిస్ విభాగంలో ప్రైవేట్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ మృతి చెందడంతో పలువురు వైద్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నకరికల్లులో 17వ శతాబ్దం నాటి విగ్రహం



నకరికల్లు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు నుంచి శివాపురం వెళ్లే రహదారి సమీపంలో సోమవారం 17వ శతాబ్దం నాటి విగ్రహం బయట పడింది. వీరుడు, తోడుగా భార్య ఉన్నట్లు ఈ విగ్రహం ఉంది. కుడి చేతిలో ఈటె, బల్లెం, ఎడమ చేతిలో కత్తి కలిగి ఉండటాన్ని బట్టి వీరుడు శత్రువును గాని, క్రూర జంతువును గాని వేటాడుతున్నట్లు చెక్కబడి ఉంది. తల భాగం లేక పోవడంతో ఆ స్థానంలో సిమెంట్‌తో చేసిన ఆనవాళ్లు కనపడుతున్నాయని, పల్నాటి సున్నపురాయితో ఈ విగ్రహం చెక్కినట్లు పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి తెలిపారు. ఈ విగ్రహాన్ని పరిశీలించిన ఆయన క్రీస్తు శకం 15వ శతాబ్దం నాటిదిగా తెలిపారు. వీరవంతుడు, అతని భార్య యుద్ధానికి సిద్ధం అన్నట్లుగా ఈ విగ్రహం చెక్కబడి ఉందని చెప్పారు.

జిల్లా ప్రజా రవాణాధికారిగా.. విమల బాధ్యతల స్వీకారం

● నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎంగా రవికాంత్ రిలీవ్



డీపీటీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న విమల

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా రవాణాధికారిగా సీహెచ్ విమల గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని కార్యాలయంలో సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎంఈ (వర్క్స్)గా వ్యవహరిస్తోన్న ఆమె గుంటూరు డీపీటీవోగా నియమితులైన విషయం తెలిసిందే. నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం (ఓఅండ్‌సీ)గా బదిలీ అయిన రవికాంత్ ఇక్కడ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. నూతన డీపీటీవో విమల మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు శక్తివం చన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇందుకు అధికారులు, సిబ్బంది సమన్వ యంతో పనిచేయాలని కోరారు. డిప్యూటీ సీఎంఈ కె.సత్యనారాయణ, పీవో పి మాలతి, డిపో మేనేజర్లు, ఇతర అధికారులు, సిబ్బంది నూతన డీపీటీవోకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

51,956 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 54,117 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,956 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,027 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13000	334	9800	13400
273	10000	12400	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	10000	13000
4884	---	---	341	10000	13800
సూపర్ 10	---	---	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

❖ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి



వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు తదితరులు

పెదకాకాని, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యోగా అవగాహన ర్యాలీ సోమవారం జరిగింది. వర్సిటీ మెయిన్ గేట్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి పాల్గొని, మాట్లాడారు. యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమని ఆయన పేర్కొన్నారు. రోజువారీ యోగా అభ్యాసం సంపూర్ణ శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ యోగా భావోద్వేగ స్థిరత్వాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుందన్నారు. ఇన్‌చార్జి రెక్టార్, రిజిస్ట్రార్ ఆచార్య రత్న షీలామణి, ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న వర్సిటీ ప్రధాన క్రీడా మైదానంలో సుమారు 10 వేల మందితో యోగాంధ్ర వేడుకలు జరుగుతాయని తెలిపారు. వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ కోయంబత్తూర్ వర్సిటీ కో-ఆర్డినేటర్ ఎ. రాధిక వివిధ యోగాసనాలు చేయించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్, రూసా డైరెక్టర్ ఆచార్య ఎస్ మురళీమోహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్య తేజ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిర్చియార్డు గ్రేడ్-1 సెక్రటరీగా సుబ్రహ్మణ్యం కొనసాగింపు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) గ్రేడ్-1 సెక్రటరీగా సీహెచ్ సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌ని కొనసాగిస్తూ మార్కెటింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు ఏఎంసీ గ్రేడ్-1 సెక్రటరీ సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌పై మిర్చి యార్డులో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన డిప్యూటేషన్ ముగియగా.. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఇక్కడే కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంటర్ బోర్డు ఆర్ఐఓగా సునీత



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్ఐఓ సునీత

గుంటూరు (విద్య) జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు ఆర్ఐఓగా గన్నెపూడి సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆమెను బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అక్కడ విధులు నిర్వహిస్తూనే గుంటూరు ఆర్ఐఓగా (ఎఫ్ ఏసీ) సునీత బాధ్యతలు నిర్వహి స్తారు. నూతన ఆర్ఐఓను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రేపు ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు విద్య జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 18న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సహాయ సంచాలకులు సాయి వరప్రసాద్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలన్నారు. వివరాలకు 99516 77559 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

'కో-ఆపరేటివ్' బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కో - ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కేవీ శివరావు, టి.శివకృష్ణ, కోశాధికారిగా పి.లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోనూరు గోపి ప్యానల్ విజయం సాధించింది. గుంటూరులో ఆదివారం అసోసియేషన్ జిల్లా మహా జన సభ అనంతరం ఎన్నికలు అర్ధరాత్రి వరకు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల ఉద్యోగులు ఎన్నికలకు హాజరయ్యారు. ఎన్నికల అధికారి జి.నారాయణరెడ్డి అర్ధరాత్రి దాటిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి, ఫలితాలను ప్రకటించారు. జాయింట్ సెక్రటరీగా ఎం.మురళీ, అసిస్టెంట్ సెక్రటరీగా షేక్ జాన్‌బీ, డైరెక్టర్స్‌గా జి.శ్రీనివాసరావు, కె.అనిత భావన, కె. భాగవతి, ఎం.ప్రవళిక, ఆర్.భాను, వి.నరేం ద్రరెడ్డి ఎన్నికైనట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గ సభ్యులకు బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

ఏపీ టాక్స్ బార్ రాష్ట్ర అధ్యక్షుడిగా రామరాజు



రామరాజు శ్రీనివాసరావు

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ రాష్ట్ర అధ్యక్షుడిగా నగరానికి చెందిన ప్రముఖ ఆడిటర్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో 2 వేలకు మందికి పైగా టాక్స్ ప్రొఫెషనల్స్ సభ్యులుగా ఉన్న ఏపీ టాక్స్ బార్ అసోసియేషన్‌కు నెల్లూరులో జరిగిన సమావేశంలో రామరాజు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ఆయన 2025-27 వరకు అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఆడిటర్ రామరాజు గతంలో ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ (సదరన్ జోన్) చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్‌వీజేకే కుమార్, కోట సునీల్, ఏవీఎస్ కృష్ణమోహన్, ఫణికుమార్, ఫణి రాజ్‌కుమార్, చక్ర రమణ, సురేష్‌లకు తన కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా త్వరలో గుంటూరు లేదా విజయవాడలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు టాక్స్ ప్రాక్టీషనర్స్ రామరాజుకు అభినందనలు తెలియజేశారు.

సొంత మండలాలల్లో బదిలీలకు అవకాశం కల్పించాలి

● అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను సొంత మండలంలో బదిలీకి ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన గుంటూరులో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి జీవో 5 ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఈసారి బదిలీలు కల్పించనున్నారని వివరించారు. బదిలీల్లో భాగంగా సచివాలయ ఉద్యోగులకు వారి సొంత మండలాలను కేటాయించరాదని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని రజాక్ తెలిపారు. ఈ ఆదేశాలతో ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారన్నారు. రికార్డ్ అసిస్టెంట్ కంటే కూడా తక్కువ జీతంతో సచివాలయ ఉద్యోగులు వారి నివాసాలకు దగ్గరగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి ఈ నిబంధనను సడలించి వారికి సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలని రజాక్ విజ్ఞప్తి చేశారు. అంతర్ జిల్లాల బదిలీలకు కూడా అవకాశం కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించటం వంటి కారణాలతో మంగళవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు బ్రాడీపేట 1/14వ లైను నుంచి 4/18వ లైను వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

బదిలీలు, పదోన్నతుల నిర్వహణపై ఫ్యాప్టో హర్షం

గుంటూరు(విద్య), 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ స్థాయిలో పదోన్నతులు బదిలీలు చేపట్టడం చరిత్రాత్మకం అని గుంటూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.


నోబుల్ టీచర్స్ అసోసియేషన్..

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టడం హర్షణీయమని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు బొనిగల హైమారావులు ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతులు, బదిలీలు చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ తదితరులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సోమవారం వారు ప్రకటనలో తెలిపారు.

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లారెడ్డినగర్, శ్రీవిఘ్నేశ్వర స్వామి సహిత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం గోపూజ, మండపారాధన, అయ్యప్ప స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు జరిగాయి. అనంతరం హోమం, మహా పూర్ణాహుతి, మెట్లపూజ, శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం కల్యాణమూర్తులతో శోభాయాత్ర, పుష్పాభిషేకం జరిగాయి. కార్యక్రమాలను మెట్టు కృష్ణారెడ్డి, గుంటూరు వేమారెడ్డి, సీతారామిరెడ్డి తదితర పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

మహాభారతంపై ఆధ్యాత్మిక ప్రవచనం



ప్రవచనం చేస్తున్న గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి

గుంటూరు (తూర్పు), జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం మహాభారతంలోని అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రవచిస్తూ మానవ ధర్మాల్లో దైవ, పితృ, ఋషి రుణాలను ధర్మంగా పరిగణించి ఆచరించాలన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 268 అర్జీలు

● పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 268 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌తో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, సీపీవో శేషశ్రీ, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, హార్టికల్చరల్ ఏడీ రవీంద్రబాబు, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, డీపీవో నాగసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కొడిగుడ్ల సత్రాన్ని తక్షణమే ప్రారంభించి, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలనే నిబంధనను అమలు చేయడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అటువంటి విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో షేక్ సమీర్, షంషీర్, సుభాని ఉన్నారు.

● మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య, ఎస్ఎంఆర్ కార్మికులకు షరతులు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. కార్యక్రమంలో పూనేపల్లి శ్రీనివాసరావు, కుంభా శివయ్య, ఆర్ముగం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ ముస్లిం సంఘ నాయకులు అర్జీ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోని పెద్ద మసీదు, అంజుమన్ ఏ ఇస్లామి యా ధార్మిక సంస్థలకు చెందిన కొత్త మల్లాయపాలెంలోని 233 ఎకరాలు, చినకాకానిలోని 78 ఎకరాల వక్ఫ్ భూమిని సేకరించి ఏపీఐఐసీ ద్వారా ఐటీ పార్కులకు కేటాయించడం సరైంది కాదన్నారు. వక్ఫ్ చట్ట ప్రకారం ఈ భూములను ముస్లింల సంక్షేమానికి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎం చిష్టి, మహమ్మద్ కలీమ్, ఖాజావలి, బాషా, బాజీ, జబ్బర్ తదితరులున్నారు.

● దుగ్గిరాల, శుభం మహేశ్వరీ కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పంట కోల్పోయిన రైతులతో పాటు వ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతూ వారు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. 12 మంది వ్యాపారులు మొత్తం 25వేల పసుపు బస్తాలను నిల్వ చేసుకున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తొలుత రైతులకు పరిహారం ఇచ్చిన తరువాతే వ్యాపారులకు న్యాయం చేస్తామని వ్యవసాయ మంత్రి చెప్పారని, అలా గాకుండా రైతులకు, మాకు ఒకేసారి పరిహారం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పరుచూరి శ్రీనివాసులు, తన్నీరు పుల్లయ్య, రాఘవేంద్రరాజు తదితరులున్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అర్జీలను నిర్దేశిత గడువులోగా శాశ్వతంగా పరిష్కరించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్‌యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 27 ఫిర్యాదులు తీసున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి 44 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను విభాగాల వారీగా విభజించి, సంబంధిత విభాగాధిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాస రావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సీపీ రాంబాబు, వీఏఎస్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులతో ప్రోత్సాహక బహుమతులు అందజేత

గుంటూరు, కార్పొరేషన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట, నాజ్ సెంటర్లోని జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో మొదటి ఐదు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 1972-73 ఏడాదికి చెందిన పూర్వ విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. 582 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన షేక్ చాంద్‌బాషా, 568 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన బీ శ్రీహరికృష్ణ, తృతీయ స్థానంలో డీ జయప్రసన్న, మణికంఠ (561), నాలుగో స్థానంలో నిలిచిన షణ్ముఖ శ్రీనివాసరావు (560)లకు వరుసగా రూ.10వేలు, రూ.8 వేలు, రూ.7వేలు, రూ.5 వేలు చొప్పున అందజేశారు. పూర్వ విద్యార్థిని ఏ అనసూయ, ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి వారు ఆధ్వర్యంలో 20 ఫ్యాన్లను వితరణ చేశారు. కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయిని కే సుధారాణి, ప్రస్తుత హెచ్ఎం వేణుగోపాల్, అధ్యాపక సిబ్బంది పూర్వ విద్యార్థులు వీర్రాజు, సుబ్రహ్మణ్యం, కే మోహన్‌రావు, శివ శంకర్, భాను, డీవీ రామారావు, వినోద్, పి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతులు పొందిన విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

కవిత్వంతో.. కాసేపు

గుంటూరు(తూర్పు), జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం ప్రతినెలా నిర్వహిస్తున్న కవిత్వంతో.. కాసేపు కార్యక్రమాన్ని సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని ఆధ్వర్యంలో కొరిటెపాడు, సాకేతపురంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగీత, సాహిత్య ప్రముఖులు శ్రీ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవిత్వం అంటే ఏమిటి? కవిత్వం రాయటమే కాదు చదవటం కూడా తెలిసుండాలని ఒక కవిత ద్వారా తెలియజేశారు. కవిత్వంతో పాటు ఒక పుస్తకాన్ని పరిచయం చేస్తే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో కవులు అనిల్‌కుమార్, సుభారాధాకృష్ణ, సంబరాజు రమణి, తాటికోల పద్మావతి, లలితకుమారి, షేక్. మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కవిత్వంతో, కాసేపు కార్యక్రమంలో పాల్గొన్న కవులు

శారదా కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలివ్వాలి : ముప్పాళ్ల

మంగళగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు శారదా కాలనీ నివాసితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. మంగళగిరిలో సీసీఎల్ఏ కార్యాలయంలో భూపరిపాలనా ఉన్నతాధికారి జీ జయలక్ష్మీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ముప్పాళ్ల మాట్లాడుతూ 1977లో తుపాను బాధితులకు 1979లో శారదాకాలనీని ఏర్పాటు చేసి 1200 మంది పేదలకు పట్టాలు ఇచ్చారని చెప్పారు. 45 సంవత్సరాలకు పైగా ఇక్కడ అనేక మంది పేద, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటున్నారని, వారికి ఎలాంటి చట్టబద్ధమైన పట్టాలు లేవని తెలిపారు. దీంతో కుటుంబ అవసరాలు, ఆరోగ్య సమస్యలు ఇచ్చినప్పుడు రుణాలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. పది సంవత్సరాలకు పైగా నివసిస్తున్న యజమానులకు ఫ్రీ హోల్డింగ్ పేరుతో ఉన్న జీవోను ఉపయోగించి ప్రభుత్వంతో సంప్రదించి పట్టాలు ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తామని సీసీఎల్ఏ జయలక్ష్మీ తెలిపారని ముప్పాళ్ల పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య, అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు

● నకిలీ విత్తనాలు, ఇతర వస్తువులపై ఆరా

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ ఆర్టీసీ కార్గో పార్శిల్ కార్యాలయంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీ ఆదినారాయణ, ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులతో కలిసి తనిఖీలు చేశారు. పార్శిల్ కార్యాలయానికి వచ్చిన వివిధ రకాల వస్తువులను పరిశీలించి, సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల నకిలీ విత్తనాలు, ఎరువులతో పాటు వివిధ రకాల వస్తువులు పార్శిల్‌కు వస్తోన్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. పార్శిల్‌కు వచ్చే వస్తువులను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించాలని, పూర్తి వివరాలు తెలుసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.



కార్గో పార్శిల్‌లో వస్తువులను తనిఖీలు చేస్తున్న ఏటీఎం ఆదినారాయణ, పోలీసులు

ఎస్‌కేబీఎం స్కూల్లో విద్యా కిట్లు పంపిణీ

గుంటూరు(విద్య), జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం స్కూల్లో సోమవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఖాజావలి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన విద్యాకిట్లను సద్వినియోగించుకోవాలని సూచించారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తూ బోధన అందిస్తున్నట్లు వివరించారు. తల్లికి వందనం విద్యా కిట్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వై వెంకటరమణమ్మ ఎస్ శిరీష, సాంబశివరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం ఖాజావలి తదితరులు

రెండేళ్లు తిండి పెట్టకుండా గదిలో నిర్బంధించారు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల తనకు తిండి పెట్టకుండా గదిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని స్తంభాలగరువుకు చెందిన శ్యామ్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తన భార్య కోటేశ్వరి, కొడుకు హనోక్ ఉన్నారన్నారు. తన భార్య 20 ఏళ్ల క్రితం వెళ్లిపోయింది అన్నారు. ఐదేళ్ల క్రితం వెనక్కు వచ్చింది అన్నారు. అయితే తాను కాలు జారి పడిపోవడంతో రెండు కాళ్ల దెబ్బతిన్నాయని మంచంలోనే ఉన్నానని తెలిపారు. దీంతో తన భార్య మరో సారి వెళ్లిపోయింది అన్నాడు. అయితే తన కుమారుడు, కోడలు తనను నిర్బంధించి బయటకు కదలకుండా సరిగా తిండి కూడా పెట్టలేదన్నారు. కనీసం దుస్తులు కూడా ఇవ్వలేదన్నారు. నెలరోజుల క్రితం దొంగ చాటుగా సంతకాలు పెట్టించుకుని తన ఆస్తిని కొడుకు, కోడలు కాజేసి నన్ను వదిలేసి వెళ్ళిపోయారు అన్నారు. వంట సామాను టీవీ వంటి వాటిని కూడా తీసుకెళ్లారన్నారు.

లైంగికంగా వేధించిన మామ

పెళ్లయినప్పటి నుంచి భర్త తనను దూరం పెడుతుండగా మామ తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పాత గుంటూరు అల్లీ నగర్‌కు చెందిన వివాహిత ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన భర్త తెనాలి మున్సిపాలిటీలో వాటర్ డిపార్టుమెంట్లో టెంపరరీగా పనిచేస్తున్నాడని తెలిపింది. అయితే అక్కడ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను దూరం పెట్టడంతో మూడేళ్ల క్రితం పుట్టింటికి వచ్చేసానని చెప్పింది. తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

రైస్ పుల్లింగ్ పేరుతో రూ.7.4 కోట్లు మోసం

రైస్ పుల్లింగ్ పేరుతో అరండల్‌పేటలోని నూనె వెంకటరెడ్డిని కొంతమంది ముఠాగా ఏర్పడి ఏడు కోట్ల 40 లక్షల రూపాయల వరకు మోసం చేశారు. తిరుపతికి చెందిన యుగంధర్, రమణ గుంటూరుకు చెందిన ఆలీ, బాజీ, పేరేచర్లకు చెందిన ఉస్మాన్ మరి కొందరు ముఠాగా ఏర్పడి 15 కోట్లు పెట్టుబడి పెడితే వేల కోట్లు వస్తుందని నమ్మించారు. ఇందుకు గాను ఒకరు సగం పెట్టుబడి పెడుతున్నారని మిగతా సగం మీరు పెట్టుబడి పెటాలంటూ వెంకటరెడ్డిని కోరారు. తన వద్ద రైస్ పుల్లింగ్‌కు సంబంధించిన మెటల్ ఉందని దానిని ఏరో స్పేస్ మెటల్స్ కంపెనీలో పరీక్షించాలన్నారు. దాని పరీక్షకు స్పెషల్ సూటు వేసుకోవడంతో పాటు అనేక ఆర్భాటాలు ఉన్నాయని చెప్పి వెంకటరెడ్డి నుంచి ఏడు కోట్ల 40 లక్షలు తీసుకున్నారన్నారు. చివరకు మోసపోయానని తెలుసుకొని అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్ ట్రాక్‌లో యువకుడి మృతదేహం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌లో గుర్తు తెలియని సుమారు 35 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆ యువకుడి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరచారు. ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



యోగాలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

నిత్యజీవితంలో యోగాని భాగం చేసుకోవాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ నిత్య జీవితంలో యోగాని భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. సోమవారం స్థానిక గాంధీ పార్క్‌లో జీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాని అన్ని వర్గాల ప్రజలు తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఇప్పటికే ప్రజల్లో యోగాపై అవగాహన కల్పించడానికి 15 రోజులుగా జీఎంసీ అనేక కార్యకమాలు చేపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నగరపాలక సంస్థ యోగా సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ 21న ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే భారీ యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే నసీర్ కోరిన విధంగా త్వరలో నగరంలో యోగా సెంటర్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీలా మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యానికి ఖర్చులేని ఔషధంగా యోగా ఉంటుందన్నారు. యోగాని ప్రతి ఒక్కరికీ తెలియచేయడానికి ప్రభుత్వం విరివిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐడీసీ చైర్మన్ పిల్లి మాణి క్యరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, జిల్లా టూరిజం శాఖాధికారి శ్రీరమ్య, డిప్యూటి కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, యోగా గురువు సాంబశివరావు బృందం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

తల్లికి వందనం ఒక గొప్ప అధ్యాయం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తల్లికి వందనం పండుగ సంబరాలు జరుగుతున్నాయని, ఇది దేశంలోనే ఒక గొప్ప అధ్యాయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు అప్పులు చేసి ప్రజలకు తిప్పలు మిగిల్చారని విమర్శించారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో కేవలం కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమలు చేశారని తెలిపారు. కూటమి ఆధ్వర్యంలో యువనేత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచుతూ ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లికి వందనం నిధులు జమైన ప్రతి కుటుంబానికి ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

● ప్రతి ఇంటికీ సౌర వెలుగులు

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి సౌర వెలుగులు అందాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, బ్యాంకు ప్రతినిధులతో సోమవారం ఆయన తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలకు రెండు కిలో వాట్ల వరకూ ఉచితంగా సోలార్ ప్యానెళ్లు ప్రభుత్వమే అందిస్తుందని, బీసీలకు మూడు కిలోవాట్లకు రూ.98వేలు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. అధికారులు వినియోగదారులను ప్రోత్సహించాలని, బ్యాంకులు రుణ సహాయం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రతి తల్లి కళ్లలో ఆనందం నింపిన మంత్రి లోకేశ్

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి తల్లి కళ్లలో ఆనందం నింపేలా మంత్రి నారా లోకేశ్ తల్లికి వందనం అమలు చేసి చూపించారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తుంటే, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.2 వేలు లోకేశ్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు ఆరోపించడం వాళ్ళ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో అమ్మఒడి కింద రూ.13 వేలు ఇచ్చారు కాబట్టి, రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయో, తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయో వైసీపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15కి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని అన్నారు. తల్లికి వందనం అందనివారి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్, ఆ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలతో ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఏడీఆర్‌ఎంగా సైమన్ సేవలు రైల్వేకు ఎంతో ఉపయోగకరం

● గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా కే సైమన్ గుంటూరు రైల్వే డివిజన్‌కు ఎంతగానో సేవలందించారని డీఆర్ఎం సుధేష్ణ సేన్ ప్రశంసించారు. బదిలీపై వేరే డివిజన్‌కు వెళుతున్న ఏడీఆర్ఎం సైమన్‌కు సోమవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ ఎంతో పాటు ఇతర అధికారులు సైమన్‌ని ఘనంగా సత్కరించారు. డీఆర్ఎం మాట్లాడుతూ గతంలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో- ఆర్డినేషన్)గా సైమన్ ఎన్నో కీలక ప్రాజెక్టుల్లో భాగస్వామ్యమయ్యారని చెప్పారు. ఆ అనుభవంతో ఏడీఆర్ఎంగా ఆయన డివిజన్ పురోగతికి బాటలు వేశారన్నారు.



ఏడీఆర్ఎం సైమన్ వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

నూతన ఏడీఆర్ఎం రమేష్‌కుమార్‌కు స్వాగతం

గుంటూరు రైల్వే డివిజన్ నూతన ఏడీఆర్ఎంగా నియమితుడైన ఎం రమేష్‌కుమార్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో నేషనల్ హైస్పీడ్ రైల్ కారిడార్ లిమిటెడ్ సూరత్‌లో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్(ట్రాక్)గా విధులు నిర్వహించారు. అలానే సికింద్రాబాద్ డివిజన్‌లో డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (ఇంజనీరింగ్)గా కూడా విధులు నిర్వహించారు. ఆయనకు డీఆర్ఎంతో పాటు డివిజనల్ అధికారులు స్వాగతం పలికారు.



మిర్చి ఎగుమతుల లోడింగ్ కోసం ఉంచిన కంటెయినర్లు

మందకొడిగా... మిర్చి ఎగుమతులు

● మార్కెట్‌లో తగ్గిన జోష్ ● రోజుకు సగటను 35 వేల టిక్కీల విక్రయం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం మిర్చియార్డు ట్రేడింగ్ ప్రారంభమైనా కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉన్నంత వేగం ఇప్పుడు కనిపించడం లేదు. నాన్ ఏసీ మిరపకాయలు రాక పూర్తిగా తగ్గిపోయాయి. ఇప్పుడు మార్కెట్‌కి వస్తున్నదల్లా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిరపకాయలే. సీజన్‌లో చైనా, ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కు డిమాండ్ మేరకు ఎగుమతులు జరిగాయి. ఇప్పుడు అరకొరగా తప్పితే ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ ఎక్కువగా రావడం లేదు. దీంతో ఇతర సరుకులతో గుంటూరు నగరానికి వచ్చిన కంటెయినర్లు వాటిని ఇక్కడ దిగుమతి చేసేశాయి. తిరిగి చెన్నై వెళ్లేందుకు మిర్చి లోడింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నాయి. చెన్నై పోర్టుకు కంటెయినర్లు లోడింగ్ ఉంటే చెప్పమని ఎగుమతిదారులకు పదేపదే ఆపరేటర్లు ఫోన్లు చేస్తున్నారు.

మిర్చి ఎక్స్‌పోర్టులలో చైనా ఆర్డర్లు 75 శాతం వరకు ఉంటాయి. మిగతా 25 శాతం ఇండోనేషియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, శ్రీలంక వంటి దేశాలకు వెళుతుంటాయి. చైనాకు ఏటా 2 లక్షల టన్నుల మిర్చి డిమాండ్ ఉండగా, ఈ ఏడాది 3 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. దీంతో అక్కడ నిండుగా సరుకు ఉండటంతో ఇప్పుడు అరకొరగానే దిగుమతిదారులు ఆర్డర్లు పెడుతున్నారు. ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కి డిమాండ్ మేరకు ఎగుమతులు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచి మార్కెట్‌కు వచ్చే సరుకు అంతా స్థానిక అవసరాలకే వ్యాపారస్థులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

ధర పెరుగుదల కోసం ఎదురు చూపు

మిర్చి ధర పెరుగుదల కోసం అటు రైతులు, ఇటు స్టాకిస్టులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ కారణంతోనే శీతల గిడ్డంగుల నుంచి కొద్దికొద్దిగా మిర్చి టిక్కీలను బయటకు తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎక్స్‌పోర్టర్లకు అవసరమైన నాణ్యత మేరకు మిరపకాయలు రాకపోతుండటంతో నిత్యం ఉదయం కమీషన్ ఏజెంట్ దుకాణాల వద్దకు వచ్చి శాంపిల్స్ నాణ్యత చూసి వెనుదిరుగుతున్నారు.

పిడుగురాళ్లలోనే.. వ్యవసాయ పనిముట్లు

- ఇక గుడివాడకు వెళ్లాల్సిన పనిలేదు
- వ్యవసాయ యంత్రాలు ఇక్కడే తయారీ
- అందుబాటులో.. తక్కువ ధరకు
- రైతులకు లాభసాటి



పిడుగురాళ్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న దుక్కి దున్నే గొర్రు సెట్లు



తయారీ పూర్తవుతున్న ట్రాక్టర్ ట్రాలీలు

పిడుగురాళ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పెట్టింది పేరుగా ఉన్న పల్నాడు ప్రాంతంలో ఆధునిక యంత్రాల కొనుగోలుకు రైతులు దశాబ్దాల పాటు గుడివాడ ప్రాంతాలకు వెళ్లేవారు. అక్కడ వ్యవసాయానికి అవసరమైన గొర్రు సెట్లు, దమ్ము చక్రాలు, ట్రాక్టర్ ట్రాలీలు తయారీకి ఆర్డర్ ఇచ్చేవారు. తయారీ పూర్తయ్యాక సొంత ప్రాంతాలకు తీసుకురావడం వ్యయప్రయాసాలతో కూడుకున్నది. కాలక్రమేణ గుడివాడ ప్రాంతంలోని యంత్రాల తయారీ నిపుణులే పిడుగురాళ్లలో తమ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. దీంతో సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలోని సుమారు 20 మండలాలకు సంబంధించిన రైతులు, ట్రాక్టర్ల యజమానులు తమకు కావాల్సిన యంత్ర పరికరాలను అనుకూలమైన రీతిలో పిడుగురాళ్లలోనే తయారు చేయించుకుంటున్నారు.

ఏమేమి తయారు చేస్తారంటే..

ట్రాక్టర్ ట్రాలీలు, దమ్ము చక్రాలు, గొర్రు సెట్లు, ట్రాక్టర్ బ్లేడు, విత్తన గొర్రు సెట్లు, ఎరువుల వాడకానికి ఉపయోగించే గొర్రు సెట్లు, ట్రాక్టర్ ట్రాలీపై వాటర్ ట్యాంకర్‌ను తయారు చేస్తారు. గుడివాడలో యంత్రాల తయారీలో నిపుణులైన సిబ్బందే పిడుగురాళ్లలో పరిశ్రమలు పెట్టి యంత్రాలను తయారుచేసి రైతులకు సకాలంలో అందిస్తున్నారు. ఏడాదిలో 8 నెలల పాటు ఊపిరి సలపని పని ఉంటుంది. సీజన్ బట్టి వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్ ట్రాలీలతో పాటు జనవరి నుంచి మే నెల వరకు వాటర్ ట్యాంకర్లు తయారీలో ఇక్కడి సిబ్బంది తలమునకలవుతుంటారు.

రైతులకు ఉపయోగకరం..

గుడివాడ ప్రాంతానికి వెళ్లి వ్యవసాయ యంత్రాలను తయారు చేయించాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. ఇప్పుడు అంతకన్నా తక్కువ ధరకే పిడుగురాళ్ల ప్రాంతంలోనే యంత్రాలు తయారు చేయడంతో పాటు కాలానుగుణంగా ఆధునిక యంత్రాలను కూడా రైతులకు అందించడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుంది.



నిజాంపట్నం హార్బర్‌లో వేటకు బయలుదేరేందుకు బోట్లలలో పూజలు నిర్వహిస్తున్న మత్స్యకారులు

వేట..మొదలు

● హార్బర్‌లో చేపలవేటకు పయనమైన గంగపుత్రులు

రేపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : గంగ పుత్రులు సోమవారం చేపల వేటకు బయలుదేరారు. తీర ప్రాంతంలో వేట విరామం ముగియటంతో గ్రామదేవతకు, బోట్లకు, సముద్ర తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం తెల్లవారుజామున 4గంటలకు చేపల వేటకు పయనమయ్యారు. బాపట్లజిల్లాలో 80 కిలోమీటర్ల మేరా సముద్రతీరం ఉంది. మోటరైజ్డ్ బోట్లు 2,500ఉండగా, నాటుపడవలు 300, మెకనైజ్డ్‌బోట్లు 250ఉన్నాయి. తీరప్రాంతంలోని నిజాంపట్నం హార్బర్‌లో బోట్లు 300, ఇంజన్‌నావలు, మరపడవలు 350లు పైగానే ఉన్నాయి. సముద్రంలో వీరి వేట వారం పాటు కొనసాగుతుంది. దీనికి కావాల్సిన ఆహార పదార్థాలు, వేటకు కావాల్సిన సామగ్రిని వారి వెంట తీసుకెళ్ళారు.



వేట విరామం అనంతరం చేపల వేటకు బయల్దేరిన బోట్లు,గంగపుత్రులు

చదువులకు.. శ్రీనిధి బాసట

● డ్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం

సత్తెనపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసా ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కొత్త పథకానికి రూప కల్పన చేసింది. వారి విద్యా వికాసానికి దోహద పడేందుకు కేవలం నాలుగు శాతం వడ్డీతో శ్రీనిధి రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్‌టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేసింది. సత్తెనపల్లి మండలంలో 1,785 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. మొత్తం 17,850 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఈ సభ్యుల పిల్లలకు పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

చదువులకు.. రూ.లక్ష వరకు!

కేజీ నుంచి పీజీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పథకాన్ని వర్తింప చేయనున్నారు. రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసమే ఉపయోగించాల్సి ఉంది. ఫీజు చెల్లింపులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్య, సామగ్రి తదితరాల కొనుగోలుకు వీటిని ఖర్చు చేయవచ్చు. నివాస ప్రాంతాల నుంచి దూరంగా ఉండే విద్యాలయాలకు వెళ్లేందుకు వీలుగా సైకిళ్ల కొనుగోలుకు సైతం అనుమతిస్తారు. ఎందుకు ఖర్చు చేశామన్న రసీదును శ్రీనిధి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. సంఘంలో ఉన్న సభ్యులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఒక్కో విద్యార్థికి అవసరాన్ని బట్టి రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు శ్రీనిధి బ్యాంక్ ద్వారా రుణాలు ఇచ్చేలా ప్రతిపాదనలు చేశారు. ఈ మొత్తాన్ని రెండు నుంచి మూడు సంవత్సరాల్లో వాయిదా రూపంలో తిరిగి చెల్లించాలి.



కౌలు రైతు సుఖీభవ అనండి

(5వ పేజీ తరువాయి)

కూడా లేని వారి సంఖ్య మూడు లక్షలకు పైమాటే. మొత్తం సాగులో దాదాపు 60 శాతం వాటా కౌలు రైతులదే. ఇందులో రకరకాల కారణాలతో సీసీఆర్ కార్డులు అందుతున్నది సగం మందికే. ఈ సగం మంది కౌలు రైతులు కూడా బ్యాంకు రుణాల దగ్గర నుంచి విత్తనాల రాయితీ వరకు నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారు.

జిల్లాల వారీగా సీసీఆర్‌సీ లక్ష్యాలివి

ఈ ఏడాది సీసీఆర్ కార్డుల జారీ విషయంలో బాపట్ల జిల్లాలో లక్ష మంది కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు జారీ చేసింది 3,800 మాత్రమే. పల్నాడు జిల్లాలో 68 వేలు సీసీఆర్‌సీ కార్డులు అందించాల్సి ఉండగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు రెండు వేలు లోపే ఉన్నాయి. అదే విధంగా గుంటూరు జిల్లాలో 55 వేలు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖకు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు మూడు వేలు లోపే ఉండడం గమనార్హం. ఖరీఫ్ మొదలయ్యే నాటికే ఈ సీసీఆర్ కార్డుల ప్రక్రియ పెద్ద ఎత్తున ప్రారంభం కావాల్సి ఉండగా ఆ దిశగా వ్యవస్థలు సన్నద్ధం కాకపోవడం కూడా కౌలు రైతులకు శాపంగా మారింది.

సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే..

అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప చేయడానికి సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే అదే విష యాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అసలు మార్గదర్శ కాలలో కౌలు రైతుల ఊసే లేకపోవడం మరింత గందరగోళ పరుస్తుందని వాపోతున్నారు. గతేడాది జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డుల్లో జూలై మొదలుకుని నవంబరు చివరి వరకు వ్యాలిడిటీ ఉన్న కార్డుల సంఖ్య దాదాపు 50 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. 11 నెలల కాల పరిమితితో ఇచ్చే సీసీఆర్ కార్డులను గతేడాది జూలై నుంచి నవంబరు వరకు కౌలు రైతులకు ఇస్తూనే ఉండ డంతో గడువు ఉన్న కార్డులు ఇంకా గణనీయంగానే ఉన్నట్లు క్షేత్రస్థాయి గణాంకాలు చెబుతు న్నాయి. వీటితోపాటు ఈ ఏడాది జారీ చేసిన కొత్త కార్డులు కూడా మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికే పదివేల వరకు ఉన్నాయి.

పొంతనలేని సమాధానాలు

సీసీఆర్ కార్డుల వ్యాలిడిటీ విషయంలో యంత్రాంగం వైపు నుంచే పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. గతేడాది జారీ చేసిన కార్డులకు గడువు ఉన్నప్పటికీ దానితో సంబంధం లేదని ఇప్పుడు కొత్తగా జారీ చేసేవే ప్రామాణికమని చెబుతన్నారు. మరోవైపు ఈ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగడానికి కారణం ఇంకా కాలపరిమితి ఉండడాన్ని యంత్రాంగం చూపిస్తోంది. ప్రస్తుతం మనుగడలో ఉన్న సీసీఆర్ కార్డులను ఎనేబుల్ చేయడానికి తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, సొంత పొలం యజమానుల వివరాలే పంపమన్నారని అధికారులు చెబుతున్నారు.

వెంటాడుతున్న సాంకేతిక కష్టాలు

అన్నదాత సుఖీభవ పథకం అర్హతకు సంబంధించి పలు సాంకేతిక చిక్కులు భూ యజమానులను వెంటాడుతున్నాయి. వైసీపీ చేపట్టిన అస్తవ్యస్త రీ-సర్వే వల్ల వేల సంఖ్యలో భూ రికార్డులు తహసీల్దార్ల లాగిన్‌లకు చేరాయి. వీటి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని సమాచారం. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ చేయించుకోవాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గత ప్రభుత్వంలో ఈ విధానంతో పాటు మొబైల్‌కు ఓటీపీ పంపి కూడా ప్రక్రియ పూర్తి చేయడంతో అన్నదాతలకు సులువుగా ఉండేది. ఇప్పుడు ఒక్క బయోమెట్రిక్ విధానాన్నే అమలు చేస్తుండగా పలు చోట్ల సర్వర్ సమస్యలతో రైతులు గంటల తరబడి పనులు మానుకుని నిరీక్షించాల్సి వస్తోంది.

సమగ్ర విచారణ జరపండి

● చిలకలూరిపేట మునిసిపాలిటీలో రూ.34 లక్షల కుంభకోణంపై ఎంపీ లావు లేఖ

చిలకలూరిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మునిసిపాలిటీలో జరిగిన రూ.34 లక్షల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంత్రికి లేఖ రాశారు. సోమవారం వివరాలను వెల్లడించారు. కుంభకోణానికి బాధ్యులైన వారిపై చర్యలతో పాటు ఆ మొత్తాన్ని రాబట్టి మున్సిపల్ ఖజానాకు జమచేయించాలని ఎంపీ కోరారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ కోరుతూ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని రాసిన లేఖను కూడా ఆయన మంత్రి నారాయణకు పంపించారు.



చిలకలూరిపేట మునిసిపల్ కార్యాలయం

అసలేం జరిగిందంటే...

వైసీపీ హయాంలో చిలకలూరిపేట మునిసిపాలిటీలో ఈ కుంభకోణం జరిగింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గంగాభవాని అనే మహిళ ఈ వ్యవహారానికి ప్రధాన బాధ్యురాలిగా గుర్తించారు. ఆమెపై పోలీసు కేసు నమోదుకావడంతో.. చాలా కాలంగా పరారీలో ఉంది. ఈ వ్యవహారంలో మొత్తం రూ.34,34,397 కాజేశారు. అనేక సార్లు ఈ అంశం చిలకలూరిపేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు వచ్చింది. దీనిపై వివరాలు వెల్లడించాలని టీడీపీ కౌన్సిలర్లు అధికారులను గట్టిగా నిలదీశారు. కానీ, అధికారులు స్పష్టత ఇవ్వకుండా కాలం గడిపారు. ఈలోగా కాజేసిన మొత్తంలో రూ.12 లక్షలు ఖజానాకు జమ అయ్యాయి. ఇంకా రూ.22 లక్షలకు పైగా జమ కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దీనిపై దృష్టి సారించారు. అనంతరం ఈ కుంభకోణంపై ప్రాథమిక విచారణ జరిగింది. మొత్తం 15 మంది మునిసిపల్ సిబ్బంది దీనికి బాధ్యులని విచారణలో తేల్చారు. వీరిలో ఒకరు చనిపోయారు. పలువురు వేర్వేరు మునిసిపాలిటీలకు బదిలీ అయ్యారు. అందులో బాధ్యులైన పది మందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. మరో నలుగురు ఉన్నతాధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది.

సచివాలయ ఉద్యోగుల.. బదిలీలకు శ్రీకారం!

(5వ పేజీ తరువాయి)

క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సంబంధిత సమస్యలు ఉన్నవారికి బదిలీల్లో అధికా ప్రాధాన్యం ఇస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నచోటికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. కాగా బదిలీపై వెళ్లే ముందు ఉద్యోగులు వారి బకాయిలను చెల్లించాలి. ఐటీడీఏ ప్రాంతాలకు బదిలీ అయినవారు తప్పనిసరిగా విధుల్లో లేకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

● షెడ్యూల్ ఇలా..

సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 16న ప్రక్రియ ప్రారంభమై 30వ తేదీ నాటికి పూర్తి కావాలని నిర్దేశించింది.

తేదీ	ప్రక్రియ
జూన్ 15-16	ఉద్యోగి వివరాల నమోదు
జూన్ 16- 18	ఖాళీల నమోదు
జూన్ 22- 24	బదిలీలకు దరఖాస్తులు
జూన్ 25- 29	దరఖాస్తుల పరిశీలన- ఉత్తర్వుల జారీ
జూన్ 30(చివరిరోజు)	అభ్యంతరాల పరిష్కారం
జూన్ 30	అన్ని బదిలీలను పూర్తి చేయాలి
జూలై 10	ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలి

అసాంఘికానికి.. రహదారి

● పట్టణ బైపాస్‌లో మద్యం సేవించి, బాటిళ్లతో వీరంగం

మాచర్లటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ఔటర్ బైపాస్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీశైలం రోడ్డులోని విశ్వ బ్రాహ్మణ కాలనీ నుంచి గుంటూరు రోడ్డులోని శివప్రియ నగర్ వరకు సుమారు 8 కిలోమీటర్లు.. రెండు ఫ్లైఓవర్లు, చంద్రవంకపై హైలెవల్ బ్రిడ్జితో రహదారిని రూ. 89 కోట్లతో శరవేగంగా నిర్మిస్తున్నారు. రైల్వే ట్రాక్ బ్రిడ్జి తప్ప మిగతా పనులు పూర్తయ్యాయి. ఈ రహదారి విశాలంగా, నిర్మానుష్యంగా ఉండడంతో చీకటి పడితే చాలు మందుబాబులు గుంపులుగా మద్యం సేవిస్తూ.. ఖాళీ సీసాలను రోడ్డుపైనే పగలగొడుతున్నారు. ఎక్కడ చూసినా గాజు పెంకులే కనిపిస్తున్నాయి. గంజాయి వంటివి సేవించి ఘర్షణలకు కూడా దిగుతున్నారు. వాకింగ్ చేసే వారు అక్కడి వాతావరణం చూసి భయపడుతున్నారు. సమీప పొలాల రైతులు పొలం పనులు ముగించుకొని చీకటి పడ్డాక బైపాస్ దాటి పట్టణంలోకి ప్రవేశించాలంటేనే హడలిపోతున్నారు. పట్టణానికి అవలి వైపున ఉన్న బైపాస్ పోలీసులకు సవాల్‌గా మారింది. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రాత్రిళ్లు డ్రోన్ సాయంతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జిలపై మందుబాబులు తాగి వదిలేసిన సీసాలు, గాజు ముక్కలు









తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



కొల్లిపర ఏవోగా శ్రీనివాసరెడ్డి బాధ్యతల స్వీకారం

కొల్లిపర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల నూతన వ్యవసాయాధికారిగా ఎస్.శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలో వ్యవసాయాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై కొల్లిపర వచ్చారు. ఇక్కడ వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించిన కె. వెంకట్రావు కమిషనరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

తెనాలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కా వేదికకు మండల తహసీల్దార్ కార్యాలయానికి ఐదు అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఆక్రమణలకు సంబంధించి 1 అర్జీ అందగా, రేషన్ కార్డు సంబంధించి 1, వంటరి మహిళ పింఛన్ కోసం 1, ఇతర సమస్యలతో 2 కలిపి మొత్తం ఐదు అందినట్లు పేర్కొన్నారు. తెలిపిన ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆక్రమణలను తొలగించరూ...

తమ నివాస ప్రాంతంలో ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని వారి నుంచి రక్షణ కల్పించి ఆక్రమణలు తొలగించాలని మండలంలోని కొలకలూరుకు చెందిన రిటైర్డ్ టీచర్ తన్నీరు సుబ్బారావు కోరారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొలకలూరుకు చెందిన తెలుగు రిటైర్డ్ టీచర్ తన్నీరు సుబ్బారావు, ఆయన కుమారుడు తన్నీరు కల్యాణ్‌తో కలిసి వచ్చి ఆక్రమణలు తొలగించి తమకు ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించాలంటూ వినతిపత్రం అందించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ త్వరితగతిన సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



అర్జీలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

పురపాలక సంఘానికి మూడు అర్జీలు

తెనాలి, మారీసుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు వచ్చాయని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. సోమవారం పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పలు శాఖల అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి 12, 32 వార్డుల్లో నూతన రోడ్లు నిర్మించాలని, 30వ వార్డులో మురుగునీరు పారుదల గురించి మూడు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరతగతిన పరిష్కరిస్తామని శేషన్న తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరులో 7 ఫిర్యాదులు

పొన్నూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం 7 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సోమవారం రెవెన్యూ శాఖకు సంధించి 2, సర్వే సంబంధిత సమస్యలపై 3, పంచాయతీరాజ్ సమస్యలపై 2 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీకి రూ.లక్ష విరాళం

పొన్నూరు టౌన్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న అంజుమన్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్‌కు సోమవారం లక్ష రూపాయలు విరాళం అందింది. పొన్నూరు పట్టణానికి రవి షీ స్వీట్స్ అధినేత సయ్యద్ ఖాదర్ ఆయన కుమారుడు సయ్యద్ బాజీ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, షేక్ బాబ్జీ, మహ్మద్‌గౌస్, షేక్ మౌలాలీ, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఏవోగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకారం



ఏవో వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖ అధికారిగా రాజవరపు వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటేశ్వరరావు కొల్లూరు నుంచి పొన్నూరు బదిలీపై రాగా, పొన్నూరు ఏవోగా పనిచేస్తున్న డేగల వెంకట్రామయ్య బాపట్లకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు.

సుద్దపల్లి ఎత్తిపోతలకు గ్రహణం వీడేనా..?



పిచ్చిమొక్కలు పెరిగి, పూడిక పేరుకుపోయిన సుద్దపల్లి చెరువు

- ఆరేళ్లుగా నిలిచిన నిర్మాణ పనులు
- కిలోమీటర్ల మేర పైపుల చోరీ
- పూర్తిచేసి సాగు, తాగునీరు అందిస్తానని ఎమ్మెల్యే ధూళిపాళ్ల హామీ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్, 16 (ఆంధ్రజ్యోతి): గత ఆరేళ్లుగా వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి గురైన సుద్దపల్లి ఎత్తిపోతల పథకంకు గ్రహణం వీడేనా అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిని పూర్తిచేసేందుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హామీతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామం సమీపం నుంచి అప్పాపురం ఛానెల్ ప్రవహిస్తున్నప్పటికీ, గ్రామంలో చెరువు ఉన్నా సుద్దపల్లి వాసులకు సాగు, తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుద్దపల్లిలో గతంలో జరిగిన అక్రమ మైనింగ్ దాటికి వందల అడుగుల లోతుకు భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో గ్రామంలో సారవంతమైన పంట పొలాలు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు ప్రజలకు దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీరు అందని దుస్థితి దాపురించింది. అయితే గ్రామంలో సుమారు 50ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద చెరువు ఉన్నప్పటికీ చెరువు పూడికపోయి పిచ్చిచెట్లు మొలిచి నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. గ్రామస్తుల అవస్థలు తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సూక్ష్మ నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించి 2018లో సుద్దపల్లి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం దృష్టికి సమస్య వెళ్లడంతో రూ.4.65కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేశారు. ఈ పథక నిర్మాణం పూర్తిచేసేందుకు నాబార్డు రూ.3.86కోట్లు సమకూర్చింది. వడ్లమూడిలోని అప్పాపురం చానెల్ వద్ద పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టి ఈ పంప్‌హౌస్ నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటిని సుద్దపల్లి చెరువులోకి సరఫరాచేసి చెరువును నింపేలా ప్రణాళికలు రూపొందించారు. ఏడాదిపాటు పథక నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. పంప్‌హౌస్ నిర్మాణంతో పాటు కాలువ నుంచి నీటిని తోడేందుకు 50హార్స్‌పవర్ ఉన్న మోటార్లను సైతం పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ పనులు చురుగ్గా సాగుతున్న సమయంలో 2019లో ఎత్తిపోతల పథకం హఠాత్తుగా నిలిచిపోయాయి.



పిచ్చిచెట్ల మధ్య ఉన్న సుద్దపల్లి పంప్‌హౌస్



పిచ్చిమొక్కల మధ్య, భూమిలో పూడిపోతున్న పైప్‌లైన్లు

నిర్లక్ష్యానికి సాక్ష్యం

2019లో ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం రావడంతో అప్పటి పాలకులు పథక నిర్మాణాన్ని నిలిపివేయించారు. కాంట్రాక్టర్లను కమీషన్ల కోసం వేధించడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. దీంతో దాదాపు 70శాతం పూర్తయిన ఎత్తిపోతల పథకం నిలిచిపోయింది. సుదీర్ఘకాలం రైతులు గ్రామస్థులు పథక నిర్మాణం కోసం వైసీపీ పాలకులను పలుమార్లు వేడుకున్నా కనికరం చూపలేదు సరికదా పథకాన్ని కొనసాగించేందుకు అయిష్టత ప్రదర్శించారు. పంప్‌హౌస్ ప్రాంతం నుంచి సుద్దపల్లి చెరువు వరకు 5 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం కోసం సమీకరించిన పైప్‌లు వైసీపీ నాయకులే చోరీచేసి అమ్ముకున్నారని పెద్దఎత్తున ఆరోపణలు సైతం ఉన్నాయి. మరికొన్ని విలువైన పైపులను కొందరు వైసీపీ నేతలు తమ పంట పొలాల్లో నీరు పారించేందుకు బలవంతంగా తరలించారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఆరేళ్లుగా ఎత్తిపోతల పథకం అసంపూర్తిగా మారడంతో ప్రస్తుతం ఆలనాపాలనా లేని పంప్‌హౌస్‌ను పిచ్చిచెట్లు మొలిచి చిట్టడవిని తలపించడమే కాకుండా శిథిల స్థితికి చేరుకుంది. రక్షణలేని పంప్‌హౌస్‌లో అమర్చిన అత్యధిక సామర్థ్యం గల మోటార్లు సైతం కనినించడం లేదు. ఆరేళ్లుగా అన్నదాతల ఎదురుచూపులు వైసీపీ పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా రైతులకు అవస్థలు తప్పలేదు.

ఎత్తిపోతల పూర్తిచేస్తా: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

సుద్దపల్లి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి ప్రజలకు అవసరమైన సాగు, తాగునీరు అందిస్తానని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ స్పష్టంచేశారు. గత ఎన్నికల సందర్భంగా సుద్దపల్లి వాసులకు ఇచ్చిన హామీని పూర్తిచేస్తానంటూ ఇటీవల గ్రామంలో ప్రకటించడమే కాకుండా పథక నిర్మాణ పూర్తికి నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో సుద్దపల్లి వాసుల్లో ఎత్తిపోతల పథకంపై ఆశలు చిగురిస్తున్నాయి, పథక నిర్మాణం పూర్తయితే సుద్దపల్లి వాసులకు సాగు, తాగునీటి కష్టాలకు చెక్ పడనుంది.

రేషన్ కార్డుల జారీలో సాంకేతిక సమస్యలు

కలెక్టర్‌కు సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ ఫిర్యాదు

పెదకాకాని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల జారీలో సాంకేతిక సమస్యలతో ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే తల్లికి వందనం ఎంతోమంది విద్యార్థులకు అందలేదని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ నాగలక్ష్మికి బాధిత కుటుంబాలతో కలిసి శివాజీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో చాలామంది నిరుపేదలు జీవిస్తున్న ప్రభుత్వ పాత నిబంధనల వల్ల తల్లికి వందనం అందుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం గృహ సర్వే చేసినప్పటికీ గృహ సర్వేను పరిగణలోనికి తీసుకోవడం లేదన్నారు. వివాహం జరిగి 10 సంవత్సరాలైనా వారి కుటుంబాలు మారినా తిరిగి పాత సర్వే లెక్కల ప్రకారం రేషన్ కార్డుల జారీ వినియోగించడం నిజమైన అర్హులను తొలగించే ప్రక్రియగా గుర్తించవలసి వస్తుందన్నారు. అర్హులైన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అని చెప్పుకునే ప్రభుత్వం రేషన్ కార్డుల జారీలో ఉన్న సాంకేతిక సమస్యలను ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నించారు. పెదకాకాని గ్రామాల్లోని సర్వే నెంబర్ 905 1బీ1, 905 1బీ2 లలోని ప్రభుత్వ స్థలాలలో భూమిలేని పేదలు 2007 నుంచి 304 కుటుంబాలు ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని విద్యుత్ శాఖ గ్రామ పంచాయతీ వారు విద్యుత్ తాగునీటి ఇంటి పన్ను సౌకర్యాలు కల్పించారని అప్పటి ఎమ్మెల్సీ నిధులతో కేఎస్ లక్ష్మణరావు గ్రావెల్ రోడ్లు వేయించారని స్థానిక శాసనసభ్యుల నిధుల నుంచి కొన్ని అంతర్గత సీసీ రోడ్లు నిర్మాణం జరిగిందని ఇంకా కొన్ని రోడ్ల నిర్మాణం చేయవలసి ఉందని 2010 సంవత్సరంలో అప్పటి తహసీల్దార్ లేఅవుట్ వేసినా ఇప్పటివరకు ఇండ్ల పట్టాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. వెంటనే రేషన్ కార్డులో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని సుందరయ్య కాలనీ వాసులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో రాజా రమేష్, వి. మల్లేశ్వరి, ఏ.నాగేశ్వరరావు, డి.నాగలక్ష్మి, కె.చిన్న రాఘవయ్య, బి.భూలక్ష్మి, డి.దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

మాగాణిలో జోరుగా కాయగూరల సాగు

● నీటి వసతి ఉన్న భూముల్లో బీర, బెండ, దోస పైర్లు

కొల్లిపర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాగాణి భూముల్లో మూడో పంటగా రైతులు కాయగూరల సాగును జోరుగా చేపడుతున్నారు. ఇప్పటికే మొక్కజొన్న, జొన్న నూర్పిళ్లు పూర్తయిన భూముల్లో విత్తనాలు విత్తారు. అవి నేడు మొలకెత్తి మండు వేసవిలో సైతం పచ్చగా కళకళలాడుతున్నాయి. మాగాణి భూముల్లో బోర్ల వసతి కలిగిన రైతులు తక్కువ నీటి వినియోగం, తక్కువ ఖర్చుతో రాబడినిచ్చే కాయగూరల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో కొన్ని గ్రామాల్లో మాగాణి భూముల్లో వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వాటిలో బోర్లకు విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. దీంతో నీటి వసతి ఉన్న భూముల్లో సన్న, చిన్నకారు రైతులు కౌలుకు తీసుకుని అతి తక్కువ ఖర్చు, కొద్దిపాటి నీటి తడులతో ఎక్కువ దిగుబడిని ఇచ్చే బీర, బెండ, దోస తదితర కాయగూరల తోటల సాగుకు ఉపక్రమించారు. కొల్లిపర, దావులూరిపాలెం సమీపంలో బీర, దోస, అన్నవరం, అన్నవరంగౌడపాలెం ప్రాంతంలో దోస, బెండ తోటలను వేశారు. మండలంలో కొల్లిపర, బొమ్మువానిపాలెం, మున్నంగి తదితర గ్రామాల్లో కాయగూరల తోటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం కూరగాయలకు మంచి ధర ఉండటంతో రైతులు మాగాణి భూముల్లో కూరగాయల సాగు చేయటానికి పెద్ద సంఖ్యలో మొగ్గు చూపారు.



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

వికసిత భారత్... ప్రధాని మోదీ లక్ష్యం : శివయ్య

పొన్నూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా కార్యదర్శి దానబోయిన శివయ్య అన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణంలో వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ప్రధాని మోదీ పాలన 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ 11ఏళ్లుగా భారతదేశం అభివృద్ధిపథంలో ప్రపంచ అగ్రరాజ్యాల సరసన నిలిపిన ఘనత ప్రధాని మోదీదేనని కొనియాడారు. రానున్న రోజుల్లో భారతదేశాన్ని అగ్రరాజ్యంగా నిలిపేందుకు ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 11ఏళ్ల పాలన గురించి, అమలుచేసిన సంక్షేమాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తోట శ్రీనివాస్, గోవాడ వెంకటకృష్ణ, కలపాల శ్రీనివాస్, వడ్రాణం ఉదయ్, కోటి వెంకటేశ్వర్లు, గురుబాలు, గుడివాడ పవన్, గోవాడ శ్రీనివాస్, వడ్రాణం పిచ్చియ్య, దాసరి శ్రీనివాస్, చెక్కా వెంకటేశ్వర్లు, హైమారావు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి

● మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఐతానగర్‌లో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో డ్రెయిన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని, తొలగించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిచాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్డు ప్రజలు కూడా సహకరించాలని ఇంటా బయటా వచ్చే వ్యర్థాలను మూడు బుట్టల విధానాన్ని అనుసరించి ఇంటి వద్దే పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈవో రాయల సుబ్బారావు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల తల్లిదండ్రులు భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు భవిత కేంద్రంలో సోమవారం తల్లిదండ్రులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందించే విద్య, ఫిజియో, స్పీచ్‌థెరపి వంటి సేవలు ప్రభుత్వం అందించే ప్రోత్సాహాల గురించి అవగాహన కల్పించారు. స్టూడెంట్ కిట్లతో పాటు వీల్‌చైర్స్, రోలేటర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవిత కేంద్ర నిర్వాహకులు, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న అధికారులు



మాజీమంత్రి ఆలపాటి వెంకట్రామయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు రమేష్, మురళి తదితరులు

మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్యకు ఘన నివాళి

తెనాలి, మారీసుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య 60వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. సోమవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆలపాటి వెంకట్రామయ్య విగ్రహం వద్ద టీడీపీ సీనియర్ నేత గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో ఆలపాటి వెంకట్రామయ్య వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ మున్సిపల్ చైర్మన్‌గా పట్టణాభివృద్ధికి ఆయన చేసి మరువలేమన్నారు. రాష్ట్ర మంత్రిగా ఆయన పేద ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కన్నెగంటి మురళి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొల్లిపర వ్యవసాయ కార్యాలయంలో ఈ కేవైసీ చేస్తున్న వ్యవసాయాధికారులు

రైతులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలి

● మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి

కొల్లిపర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర వ్యవసాయ కార్యాలయంలో చేస్తున్న ఈ కేవైసీని ఆయన పరిశీలించారు. ఈ కేవైసీ చేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ కార్యాలయంలో, రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ సంబంధించి ఈ కేవైసీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేవైసీ చేయించుకుంటేనే అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాల్లో జమకానున్నట్లు తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరేణుకాదేవి అమ్మవారి ఆలయంలో భజనసమాజం వారికి దుస్తులు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

శ్రీరేణుకాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొల్లిపర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలోని శ్రీరేణుకాదేవి అమ్మవారి ఆలయంలో పండితులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు జగన్నాధాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మలు గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని కోరుతూ ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచన, విష్వక్సేన వంటి పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు తాళాల భజనలు నిర్వహించారు. శ్రీరేణుకాదేవి అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కమిటీ సభ్యులు భీమవరపు సీతారామిరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి తాళాల భజన చేసిన మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు.



ప్రధాన రహదారిపై కాలువలోకి దూసుకెళ్లి నిలిచిన బస్సు

కాలువలోకి వెళ్లిన బస్సు

● అంగలకుదురు ప్రధాన రోడ్డుపై ఘటన

తెనాలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఓ బస్సు డ్రైవర్ పార్కింగ్ చేసే సమయంలో హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో బస్సు దానంతట అదే ముందుకు వెళ్లి కాలువలో కూరుకుపోయిన ఘటన మండలంలోని అంగలకుదురులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సును అంగలకుదురులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్‌లో పెట్టారు. హ్యాండ్ బ్రేక్ వేయకుండా డ్రైవర్ బస్సును విడిచి పనులపై బయటకువెళ్లాడు. కొద్ది సేపటికే బస్సు పార్కింగ్ చేసిన ప్రాంతం నుంచి ముందు భాగం పల్లంగా ఉండటంతో దానంతట అదే ముందుకు వెళుతూ గుంటూరు- తెనాలి ప్రధాన రహదారికి అడ్డంగా వెళ్లి ఎదురుగా ఉన్న సైడ్ డ్రైన్‌లో దిగి నిలిచింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు చేసే ఆ రోడ్డుపై బస్సు వెళ్లే సమయంలో వాహనాలు లేకపోవడంతో పెద్దప్రమాదమే తప్పింది. బస్సు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్సకవేటర్ సాయంతో కాలువలో నుంచి బస్సును బయటకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 928 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,600, గరిష్ఠధర రూ.10,275, మోడల్‌ధర రూ.10,200 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,600, గరిష్ఠధర రూ.10,300 మోడల్‌ధర రూ.10,200 పలికాయి.

తాడేపల్లి సీఐగా వీరేంద్రబాబు



సీఐ వీరేంద్రబాబు

తాడేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సీఐగా పీ వీరేంద్రబాబు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన సీఐ కళ్యాణ్‌రాజు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీరేంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాడేపల్లి ఎస్‌ఐగా విధులు నిర్వహించిన అనుభవంతోపాటు పల్నాడు జిల్లా, ఫిరంగిపురం, గుంటూరు అర్బన్ పట్టాభిపురం సీఐగా కూడా వీరేంద్రబాబు విధులు నిర్వహించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని సీఐ వీరేంద్రబాబు స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బాధ్యతల స్వీకరణ

పెదనందిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెదనందిపాడు సెక్టారుకు షేక్ మెహరున్నీసాబేగం, వరగానికి ఎండీ జరీనాలు బదిలీపై రాగా ఇక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ ఫిరంగిపురంనకు, వి.అరుణ నాదెండ్ల మండలానికి బదిలీపై వెళ్లారు.

ఏవోగా విజయబాబు

దుగ్గిరాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండల వ్యవసాయాధికారిగా రాగల విజయబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేపల్లె ఏవోగా పనిచేసిన విజయబాబు బదిలీపై దుగ్గిరాల వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏవో శిరీష బదిలీపై గుంటూరు వెళ్లారు. విజయబాబు మాట్లాడుతూ కౌలు రైతులు, కార్డుదారులందరూ ఖరీఫ్‌లో వరి విత్తనాల కోసం రైతుసేవా కేంద్రాల్లో వీపీఏలను సంప్రదించాలని కోరారు. అన్నదాత పథకం ద్వారా లబ్ధిపొందేందుకుగానూ, రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

ప్రత్తిపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖాధికారి షేక్ సుగుణ బేగం తెలిపారు. ప్రత్తిపాడులో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా కేంద్రాల వద్ద తమ సిబ్బందితో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెదనందిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో లక్ష్మీదేవి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రు.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వేగవంతంగా నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రాజేష్, కార్యదర్శి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెంట్యాల శ్రీధర్, నాయకులు పోపూరి రామచంద్రరావు, అద్దంకి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

తాడేపల్లి(పెనుమాక), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాకలో ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ పీపీ-1, పీపీ-2 తరగతులు పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేసి మూడేళ్లు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాస్యాలు చేయించారు. ఎంపీయూపీ స్కూల్లో నిర్వహించిన ఈ వేడుకలకు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరోమణి, గ్రామ మాజీ ఉపసర్పంచ్ జానీఖాన్, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగుల పంపిణీ

మంగళగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ప్రభుత్వం అందించిన నోటు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం నగదును తల్లుల ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు.

విద్యార్థినులకు ఆర్థికసాయం

దుగ్గిరాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ మీన్‌మెరిట్ ఉపకార వేతనానికి ఎంపికైన జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులకు కొలకలూరి మాజీ సర్పంచ్ ప్రసాదం భాస్కరరావు జ్ఞాపకార్థం ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. హెచ్‌ఎం శానంపూడి శోభాదేవి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిమందిర వార్షికోత్సవం

పెదనందిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిమందిర 26వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు కాగడ హారతి, బాబా వారికి మహిళలు 108 కలశాలను గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామి వారికి మంగళస్నానాలు చేయించారు. చీరాల గాయత్రీ పరివారిచే హోమం నిర్వహించారు.

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు

- సుమారు కోటి రూపాయల విలువైన విద్యుత్ వైర్లు చోరీ అయినట్లు ప్రచారం
- గప్‌చుప్‌గా అధికారులు, ప్రజాప్రతినిధులు



అనంతవరప్పాడు జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల నుంచి కట్ చేసిన వైర్లు

వట్టిచెరుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు గ్రామ సమీపంలోని వట్టిచెరుకూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే గత ప్రభుత్వ హయాంలో గుంటూరు నగర పేదల కోసం 130 ఎకరాలు కొనుగోలు చేసి 5,300 మందికి పైగా లబ్ధిదారులకు కేటాయించారు. ఆలూ లేదు, చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టు లబ్ధిదారులకు హద్దులు నిర్ణయించకుండా కనీసం రాళ్లు కూడా బాతకుండా ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకుండానే శరవేగంగా విద్యుత్ పోల్స్ వేసి, వైర్లు లాగి, విలువైన వీధి లైట్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ ప్రాంతంపై గుంటూరు నగరపాలక అజమాయిషియా?, వట్టిచెరుకూరు మండల విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ అజమాయిషియో తెలియదు గాని కొన్ని రోజులు విద్యుత్ వెలుగులు జిగేల్ మనిపించటంతో పత్రికల్లో వార్తలు వచ్చాయి. అంతే ఆ తర్వాత విద్యుత్ కాంతులు మాత్రం కన్పించలేదు. ఇటీవల ఆ 130 ఎకరాల్లో విద్యుత్‌లైన్‌లకు వేసిన విలువైన వైర్లు గుట్టుచప్పుడు కాకుండా గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకు పోయినా ఎవరికి వారు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారే గాని విద్యుత్ చోరీ జరిగిన సమాచారం పోలీసుల దృష్టికి తీసుకెళ్లకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతున్నా అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాలకు బిగించిన సుమారు రెండువేలకు పైచిలుకు ఉన్న విలువైన లైట్లనైనా భద్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లుల కళ్లల్లో ఆనందం నింపిన మంత్రి లోకేశ్

- ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి తల్లి కళ్లలో ఆనందం నింపేలా మంత్రి నారా లోకేశ్ తల్లికి వందనం అమలు చేసి చూపించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తుంటే, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.2 వేలు లోకేశ్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు ఆరోపించడం వాళ్ళ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో అమ్మఒడి కింద రూ.13 వేలు ఇచ్చారు కాబట్టి, రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయో, తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయో వైసీపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం అందనివారి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్, ఆ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కంచర్ల శివ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల మ్యుటేషన్‌కై వినతి



సీసీఎల్‌ఏ జయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు

మంగళగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ సంస్థ భూముల మ్యుటేషన్ కోసమై సీపీఐ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మంగళగిరి సీసీఎల్‌ఏ కార్యాలయంలో భూపరిపాలనా అధికారి జీ జయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 24 వేల ఎకరాలకు పైగా అగ్రిగోల్డ్ సంస్థకు భూములున్నాయని, వాటిలో ఎలాంటి అడ్డంకులు లేని 14 వేల ఎకరాలను బహిరంగ వేలానికి రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఉన్నత స్థాయి కమిటీ సిద్ధం చేసిందని తెలిపారు. ఈ భూముల అమ్మకానికి మ్యుటేషన్ జరుగనందున వేలానికి అడ్డంకిగా మారిందన్నారు. వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఇళ్ల స్థలాలు, ప్లాట్లను కొనుక్కున్నారని, అవి కూడా మ్యూటేషన్ జరుగలేదని చెప్పారు. ఈ విషయమై సీసీఎల్‌ఏ జయలక్ష్మీ స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ ప్రతినిధులు కోటా మాల్యాద్రి, కేతినేని అగస్టీన్, చిన్ని తిరుపతయ్య, కే.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శారదా కాలనీవాసులకు పట్టాలివ్వాలి

గుంటూరు శారదాకాలనీ నివాసితులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలో సీసీఎల్‌ఏ కార్యాలయంలో భూపరిపాలనా ఉన్నతాధికారి జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

సాగునీటి కాలువలను ఆధునికీకరించాలి



పెదవడ్లపూడి వద్ద హైలెవల్ చానల్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘాల నేతలు

మంగళగిరిసిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పంటలకు సాగునీరు అందించే అన్ని కాలువలను ఆధునికీకరించాలని రైతు సంఘాల నేతలు కోరారు. ఏపీ రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, ఏపీ కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పంట కాలువలను పరిశీలించారు. పెదవడ్లపూడిలో హైలెవల్ చానల్, మద్రాస్ కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడ, మట్టి మేటలను తొలగించి సకాలంలో సాగు నీటిని అందించాలని కోరారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకర్ మాట్లాడుతూ ఉండవల్లి కృష్ణానది వద్ద నుంచి ప్రారంభమైన బకింగ్ హామ్ కెనాల్ నిజాంపట్నం వరకు తెనాలి డెల్టా ఏరియాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తుందని చెప్పారు. బకింగ్ హామ్ కెనాల్, తెనాలి డెల్టా కాలువల ఆధునికీకరణకు రూ.కోట్లు మంజూరైనప్పటికీ పనులు మాత్రం నామమాత్రంగానే జరిగాయన్నారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తిచేసి నీటి ప్రవాహానికి ఆటంకాలను తొలగించాలని, చివరి భూముల వరకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా సాంబిరెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, నేతలు వెంకటరెడ్డి, కారుమూరు మాధవరెడ్డి, బి.సత్యమారెడ్డి, గాదె మాధవరెడ్డి, రామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయిపూలే విగ్రహావిష్కరణ



సావిత్రీబాయిపూలే విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంఈవో లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు

దుగ్గిరాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో సావిత్రీబాయిపూలే విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. పద్మాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చుండూరు భాస్కరరావు, దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ స్త్రీవిద్య కోసం పోరాటం జరిపి, తొలి బాలికల పాఠశాలను స్థాపించిన ఉపాధ్యాయినిగా సావిత్రీబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కులమతాలకతీతం గానూ, పురుషాధిక్య సమాజానికి వ్యతిరేకంగా పోరాటం జరిపిన స్త్రీమూర్తి పూలే చిరస్మరణీయురాలన్నారు. హెచ్‌ఎం ఎస్ శోభాదేవి, నారాకోడూరు హైస్కూల్ హెచ్‌ఎం ఏడుకొండలు, పీహెచ్‌సీ డాక్టర్ అబ్దుల్‌రహ్మాన్, ప్రసాద్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజం అభివృద్ధి

- బొమ్మిడాల గ్రూప్ చైర్మన్ శ్రీకృష్ణమూర్తి



ఉపాధ్యాయులను అభినందిస్తున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి

గుంటూరు(విద్య), జూలై 16(ఆంధ్రజ్యోతి): దేశం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని బొమ్మిడాల గ్రూప్ చైర్మన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి అన్నారు. స్థానిక నగరంపాలెం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి బాలుర వైశ్య హాస్టల్‌లో ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. వట్టిచెరుకూరు మండలం గారపాడులో తమ తండ్రి పేరున నడుస్తున్న బొమ్మిడాల కోటి రత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేశారని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు గాదే వీర భాస్కర వెంకటరావు, ఉపాధ్యాయులు రావెల బుర్రియ్య, స్వామి వెంకట లక్ష్మీ ప్రశాంతి, మర్రెడ్డి బసవ రాజేశ్వరి, మునునూరు శ్రీలతలను బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం హనుమంతరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త మానం సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుంటి వీరయ్య, తీయగూర కృష్ణారెడ్డి, బోనం శ్యామ్ సుందర్‌రెడ్డి, మోదుగల రవికృష్ణ, ప్రొఫెసర్ సింగారావు, ఫౌండేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను మెరుగుపరచాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

మంగళగిరి సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. జగన్ ప్రభుత్వ హయాంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఆప్కాస్‌ను ఏర్పాటు చేశారని, దీనిపై అధ్యయనానికి కూటమి ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో కమిటీ వేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఆప్కాస్‌పై మంత్రుల కమిటీ అంటే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పొట్ట కొట్టి ప్రైవేటు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఉద్యోగుల్లో నెలకొన్న భయాందోళనను తొలగించాలంటే కూటమి ఆప్కాస్‌ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని సూచించారు. ఉద్యోగులను నిర్దిష్ట కాలపరిమితిలో పర్మినెంట్ చేసేలా ఆప్కాస్‌ను కొనసాగించాలని, మంత్రుల కమిటీ సిఫారసులు అందుకు అనుగుణంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మంగళగిరి సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్తా మధును కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీ వలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం తొందరపాటుతో తీసుకున్న నిర్ణయాల వల్ల అద్దె భవనాల్లో తరగతులు ప్రారంభించడమే కాకుండా సీఓఏ పర్మిషన్ కూడా లేకుండా కోర్సులను ప్రారంభించారని చెప్పారు. 2020లో 13 విభాగాలతో ప్రారంభమైన ఈ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ అనుమతి లేకపోయినా విద్యార్థులతో అడ్మిషన్లు పూర్తిచేశారని తెలిపారు. మరో పది రోజుల్లో ఫైనల్ ఎగ్జామ్స్ వుండడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, సాయికృష్ణ, రామాంజనేయులు, సుష్మ, సింధు, సుధాకర్, సుధీర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు

దుగ్గిరాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం (పశ్చిమ)లో రక్తపరీక్షలు నిర్వహించారు. జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గుంటూరులోని సమీకృత సలహా, పరీక్ష కేంద్రం వారిచే 54మందికి రక్తపరీక్షలు జరిపారు. హెచ్ఐవీ, సిఫిలిస్ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు రక్తపరీక్షలు జరిపినట్లు వైద్యురాలు డాక్టర్ ఇందిర తెలిపారు. వ్యాధి సోకినవారిని గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. షేక్ సందానీ బాషా, కిరణ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



పుల్లగడిగుంటలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, లబ్ధిదారులు

వట్టిచెరుకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకం నిధులు విడుదల చేయటం ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని స్థానిక టీడీపీ నాయకులు, తల్లికి వందనం లబ్ధిదారుల కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు. టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం కూటమి తరుపున సీఎం చంద్రబాబు చిత్రపటానికి పుల్లడిగుంటలోని ఎన్టీ రామారావు విగ్రహం వద్ద చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు, పుల్లడిగుంట గ్రామ అధ్యక్షుడు యడ్లపల్లి వీరయ్య, మన్నవ వంశీ, యంపరాల కిషోర్ బాబు, ఉప్పుటూరి చిన రాములు, గుంటుపల్లి సదాశివరావు, బాణావత్ వెంకటేశ్వరనాయక్, ఎం బాలాజీ నాయక్, ఉప్పుటూరి గోవర్ధనరావు, మన్నవ గోపాలకృష్ణ, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు అధికారుల గైర్హాజరు

- మొక్కుబడిగా పాల్గొన్న కొంతమంది అధికారులు
- జిల్లా కార్యాలయాల బాట పడుతున్న తీరు

పెదనందిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. ఇందుకు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సైతం ప్రతి సోమవారం 10గంటలకే పీజీఆర్‌ఎస్‌కు హాజరవుతుంటే మండల స్థాయిలో మాత్రం నామ మాత్రంగా అధికారులు హాజరవుతూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. మండలస్థాయి అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో హాజరై ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై అనంతరం ఆయా గ్రామాల ప్రజల నుంచి వచ్చే సమస్యలపై అర్జీలు స్వీకరించాల్సి ఉంటుంది. నాలుగైదు శాఖల అధికారులే మొక్కుబడిగా హాజరై సంతకాలు చేసి వెళ్లిపోవడంతో పలు సమస్యలపై వచ్చిన ప్రజలు తమ అర్జీలు ఎవరికి ఇవ్వాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రతి వారం ఇదే తంతు కొనసాగుతుంది. కొన్ని శాఖల అధికారులు అయితే తమ క్రింది స్థాయి సిబ్బందిని పంపించి రిజిస్టర్‌లో సంతకాలు పెట్టిస్తున్నారు. ఇలా అయితే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అక్రమ రుణంపై.. నిగ్గు తేల్చాలి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన చౌడవరం మహిళలు



ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన డ్వాక్రా మహిళలు

గుంటూరు(తూర్పు), జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి గ్రూపులను అడ్డుపెట్టుకుని దాదాపు రూ.4 కోట్ల అక్రమ రుణం పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రూరల్ మండలం, చౌడవరం గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. నల్లపాడు జీడీసీసీబీలో నిత్యం వెలుగులోకి వస్తున్న కుంభకోణాలపై విచారణ జరిపించాలని కోరారు. సూత్రధారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో 45 గ్రూపులను ఏర్పాటు చేసి పెద్దమొత్తంలో రుణాన్ని పొందారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. యానిమేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కంచర్ల భవ్యశ్రీ ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిందని, దీనికి బ్యాంకు అధికారులు, సీవో సహకరించారని తెలిపారు. మా సంతకాలు లేకుండా ఈ రుణాన్ని ఎలా జారీ చేశారో మాకు అర్థం కావడం లేదని వాపోయారు. ప్రతి గ్రూపు దాదాపు రూ.10 లక్షలు చెల్లించాలని నోటీసులు పంపుతున్నారని, ఇంత పెద్ద మొత్తాన్ని చెల్లించడం మావల్ల కాదని కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. నోటీసులు వెనక్కి తీసుకునేలా బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

బోరు పంపును కాలనీవాసులకు అప్పజెప్పాలి

గుంటూరు(తూర్పు), జూన్ 16(ఆంధ్రజ్యోతి): 50 గజాల స్థలంలో ఉన్న బోరు పంపును అప్పగించాలని కోరుతూ గుంటూరు రూరల్ మండలం, పెద్ద పలకలూరు, ఎస్సీకాలనీ ప్రజలు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ నాగలక్ష్మికి అర్జీ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి గ్రామ సర్పంచ్ వెంకటరత్నం నాయుడు కాలనీవాసుల నీటి ఎద్దడిని తీర్చేందుకు దొడ్డ ప్రసాదరావు వారి పూర్వీకులకు చెందిన 50 గజాల స్థలంలో బోరు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఈ మధ్యనే నకిలీ పత్రాలను సృష్టించి షేక్ మాబు అనే వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించుకుని, నీటి సరఫరాను అడ్డుకుంటున్నాడని తెలిపారు. దీనిపై ఆరేళ్లుగా అధికారులకు ప్రజాప్రతినిధులకు వినతులను అందిస్తున్నా సమస్యకు పరిష్కారం చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మట్టుపల్లిబాబు, పాలపర్తి రవి, నత్తల ఏసుపాదం, చిగురుపాటి సుందరరావు తదితరులు ఉన్నారు.

- పసుపు వ్యాపారులకు న్యాయం చేయాలి

దుగ్గిరాల శుభం మహేశ్వరీ కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పంట కోల్పోయిన రైతులతో పాటు వ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతూ వారు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. 12 మంది వ్యాపారులు మొత్తం 25వేల పసుపు బస్తాలను నిల్వ చేసుకున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తొలుత రైతులకు పరిహారం ఇచ్చిన తరువాతే వ్యాపారులకు న్యాయం చేస్తామని వ్యవసాయ మంత్రి చెప్పారని, అలా గాకుండా రైతులకు, మాకు ఒకేసారి పరిహారం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పరుచూరి శ్రీనివాసులు, తన్నీరు పుల్లయ్య, రాఘవేంద్రరాజు తదితరులు ఉన్నారు.

- మంచినీటి చెరువులోకి మురుగునీరు వస్తుందని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామానికి చెందిన రైతులు అర్జీ అందజేశారు. గోరంట్ల సమీప ప్రాంతాల నుంచి ఈ మురుగునీరు వస్తుందని, దీనిపై స్థానిక సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టి తీసుకువచ్చారు. ఈ కలుషిత నీటితో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఇమ్మడి రామారావు, సుధా శేషగిరి, ఇమ్మడి నాగేశ్వరరావు, సురేష్, కోటేశ్వరరావు, వంగా నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ




విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

తాడికొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారం చేపట్టిన తరువాత ఒక వైపు రాష్ట్రం అభివృద్ధి వైపు, మరో వైపు విద్యార్థుల భవిష్యత్తు బంగారు మయంగా మారాయని టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దూరి వీర హనుమంత రావు తెలిపారు. సోమవారం తాడికొండలోని రావిచెట్టు సెంటర్లో ఉన్న నార్త్ పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ విద్యా మిత్ర కిట్లలో మూడు జతల యూనిఫారం క్లాత్, బూట్లు, సాక్సులు, బెల్ట్, పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం తల్లి కి వందనం పథకంలో భాగంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నారో అంతమందికి రూ.13 వేలు చొప్పున ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నూతక్కి ప్రమీల, ఉపాధ్యాయులు శ్యామూల్ మాస్టర్, ముప్పవరపు కమలాకర్, ఆలపాటి బాలయ్య పాల్గొన్నారు.

చల్లా వారిపాలెం పాఠశాలలో..

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం చల్లా వారిపాలెంలో పాఠశాలలో పేద విద్యార్థులకు కూటమి నాయకులు రూ.18వేల విలువైన నోట్ బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు సూదా పిచ్చయ్య, టీడీపీ అధ్యక్షుడు సూరిశెట్టి హరీష్, గ్రామ బీజేపీ అధ్యక్షుడు ఎస్ సురేష్‌లు విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. సమాజంలో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కఠారి శ్రీనివాసరావు, నాగభూషణం, శంకర్, జగన్, సురేష్ ఉన్నారు.

సాయినాథ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ



ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శరత్‌చౌదరి తదితరులు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పేరేచర్ల కైలాసగిరి ప్రాంతంలో నున్న సాయినాధ్ ఓల్డ్ ఏజ్ హోమ్ వృద్ధులకు రోటరీ క్లబ్ ఆఫ్ డెక్కన్ ఆధ్వర్యంలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ ను వితరణ చేశారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ శరత్ చౌదరి, డేర్ చైర్మన్ మురళి త్రిపురనేని చేతుల మీదుగా సోమవారం ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఓల్డ్ ఏజ్ హోం వృద్ధులకు శుద్ధమైన తాగునీరు అందిం చేందుకు తమ సంస్థ రూ.3.50 లక్షలతో శుద్ధ నీటి ప్లాంట్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ అధ్యక్షురాలు రత్నప్రియ పోలిశెట్టి, కార్యదర్శి హిమబిందు, భారతి, సభ్యులు వడ్లమాని రవి, రాజ్యలక్ష్మి, రత్నప్రభాకర్, బాలకోటిరెడ్డి, అశోక్, పద్మజ, జాహ్నవి తదితరులున్నారు.